తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
26 అక్టోబరు, 2025









# ర్యాంకుల వేటలో ఆటలు మాయం!

తారాతీరం

# రుక్మిణి వసంత్, ఎన్టీఆర్ జోడీగా 'డ్రాగన్'



కొంతమంది హీరోయిన్లకు స్టార్ హీరోల జోడీకట్టే ఛాన్స్ ఆరంభంలోనే వస్తుంది. మరికొంత మంది హీరోయిన్స్ కి అలాంటి అవకాశాలు కాస్త ఆలస్యంగా వస్తాయి. ఇంకొంత మంది హీరోయిన్స్ స్టార్ హీరోల సినిమాలలో వేషాల కోసం తొందరపడకుండా, నిదానంగా తమ కెరియర్‌ను కొనసాగిస్తూ ఉంటారు. అలాంటివారి ప్రతిభకు అదృష్టం తోడైతే భారీ సినిమాలు నేరుగా వచ్చి పలకరిస్తాయి. సంచలన విజయాన్ని దోసిట్లో పెడతాయి. అలాంటి హీరోయిన్స్ లో ఒకరిగా రుక్మిణి వసంత్ కనిపిస్తుంది.

'సప్త సాగరాలు దాటి' సినిమా చూసినవారు, అమ్మాయి ఎంత పద్ధతిగా ఉంది.. అనుకున్నారు. ఈ మధ్య కాలంలో చీరకట్టులో ఇంత అందంగా ఉన్న హీరోయిన్స్ ను చూడలేదని చెప్పుకున్నారు. అయితే ఈ అమ్మాయి చీరకట్టులోనే బాగుంటుందనే అభిప్రాయాలు పెరుగుతూ ఉండటంతో, ఆ ముద్ర నుంచి బయట పడటానికి గ్లామరస్‌గా మెరవడానికి రుక్మిణి ప్రయత్నం చేస్తూ వచ్చింది. సరిగ్గా ఆ సమయంలో వచ్చిన 'కాంతార చాప్టర్ 1' ఆమె ముచ్చట తీర్చింది. ఈ సినిమాలో యువరాణి పాత్రలో ఆమె గ్లామర్ ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమా ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో బాక్సాఫీస్ బద్ధకాన్ని వదిల్చి వేస్తోంది. ఈ నేపథ్యంలో కన్నడతో పాటు, తెలుగు, తమిళ భాషల్లో ఆమెకి ఆఫర్లు పెరుగుతున్నట్టుగా తెలుస్తోంది. తెలుగు ఆడియన్స్ మాత్రం వెంకటేశ్, పవన్ కల్యాణ్, ప్రభాస్ వంటి సీనియర్ స్టార్ హీరోల సరసన నాయికగా ఈ బ్యూటీ సరిగ్గా కుదురుకుంటుందని అనుకుంటున్నారు.

# విజయ్ దేవరకొండ కొత్త సినిమా

హీరో విజయ్ దేవరకొండ అభిమానులకు ఎదురుచూపులు ముగిశాయి. తన తదుపరి చిత్రాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించారు. కొంత కాలంగా వినిపిస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, ఈ సినిమాలో హీరోయిన్‌గా స్టార్ నటి కీర్తిసురేష్ దాదాపు ఖరారయ్యారు. హైదరాబాద్‌లో నిరాడంబరంగా జరిగిన ఈ సినిమా పూజా కార్యక్రమానికి కీర్తి సురేష్ హాజరు కావడంతో ఈ వార్తకు బలం చేకూరింది. 'రాజావారు రాణిగారు' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు రవి కిరణ్ కోలా ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాత దిల్ రాజు దీనిని నిర్మిస్తున్నారు. రాయలసీమ నేపథ్యంతో కూడిన పక్కా గ్రామీణ, మాస్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఇప్పటికే విడుదల చేసిన 'కత్తి నేనే.. నెత్తురు నాదే.. యుద్ధం నాతోనే..' అనే క్యాప్షన్‌తో ఉన్న ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచింది. విజయ్ దేవరకొండ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారని తెలుస్తోంది. 'లైగర్', 'ఖుషి' వంటి చిత్రాల తర్వాత సరైన విజయం కోసం ఎదురు చూస్తున్న విజయ్ దేవరకొండ, ఈసారి పక్కా ప్రణాళికతో వస్తున్నట్లు సమాచారం.

స్క్రిప్ట్ పనులు పూర్తయినందున, చిత్ర యూనిట్ త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



ఆదివారం వార్త

26 అక్టోబరు, 2025

## మంచి ముత్యాలు

- సరైన సమయంలో, సరైన క్షణంలో పలికిన పలుకు తరతరాలు నిలుస్తుంది. - థామస్ కార్లైల్
- మేఘం, వర్షం లేకుండా ఇంద్రధనుస్సు వుండదు.- జిహెచ్.విన్సెంట్

## కదంబం

'సంఘీ'భావం....5
అత్యాచార కేసుల్లో న్యాయం ఆలస్యం

కవర్ స్టోరీ..6
ర్యాంకుల వేటలో ఆటలు మాయం!

ఈ వారం కవిత్వం...11
చైతన్యం

కథ..20
హృదయ స్పందన

సాహిత్యం.. 24
చేతిరాత యిక మృతప్రాయమా?

ఇంకా...
మొగ్గ
వారఫలం
వగైరా.. వగైరా..

# సమాచారం

## కర్రల మీద నడుస్తారు..

టక్..టక్..టక్.....టక్..టక్..టక్.. అని ఎక్కడి నుండో శబ్దం వినపడుతోంది. చుట్టుపక్కల వున్నవారికి, పర్యాటకులకు అది కర్రల శబ్దం అని తెలుస్తోంది. కానీ అది ఎక్కడి నుండి వస్తుందో, ఆ శబ్దం ఎవరు చేస్తున్నారో స్పష్టంగా తెలియడం లేదు. ఇంతలో కొంత మంది యువకులు అందరూ రెండు పెద్ద కర్రలపై నడుస్తూ రావడం కనిపించింది. అది చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అందరూ చూస్తుండగానే కర్రల సహాయంతో నడుస్తూ, కాలు కింద పెట్టకుండా వచ్చిన వాళ్లంతా ముందుకు సాగిపోయారు.



అసలు సంగతి ఏమిటంటే వీళ్ల ఇథియోపియాలోని ఒమో అనే లోయలో ఉంటారు. వీరిని బన్న తెగవారిగా పిలుస్తారు. పశువుల పెంపకం వీరి జీవనాధారం. వీళ్ల జనాభా సుమారు యాభై వరకు ఉంటుందని తెలుస్తోంది. వ్యవసాయం మొదలైన ఇతర పనులు చేసే సమయంలో కర్రలు ఉపయోగించరట. వీరి హెయిర్ స్టైల్ కూడా అందరినీ ఆకర్షిస్తుంది. పెద్దవాళ్లు, చిన్నవాళ్లు.. ఇలా అందరూ కర్రలపైనే నడుస్తారు.

పూర్వీకుల నుండి వస్తున్న సంప్రదాయం ఇది. ఒకానొక సమయంలో పాములు, క్రూరమృగాలు మొదలైన వాటి నుంచి తమని తాము రక్షించుకునేందుకు ఈ విధంగా కర్రలను ఊతంలా చేసుకుని నడిచేవారట. ఇప్పటికీ అటవీ ప్రాంతంలో వారి నివాసాలు ఉండటం వల్ల అదే పాత పద్ధతిని కొనసాగిస్తున్నారు. ఈ కర్రలు సైతం చాలా పొడుగ్గా ఉంటాయి సుమా. ఎంత దూరమైనా సరే ఈ కర్రల పైనే నడవడం వీరికి చాలా ఈజీ అని సమాచారం.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




### ఏది మంచిది?

"పేపర్ గోల్డ్ కొనడం మంచిదా? లేక ఫిజికల్ గోల్డ్ కొనడం మంచిదా?" ఒక వీక్షకుడు టివిలో వస్తున్న కార్యక్రమంలో ప్రశ్నించాడు.

"అది నన్ను అడగడం కన్న ఇంట్లో మీ ఆవిడ గారిని అడగడం" సబబు అతని జవాబు.



### గొడవ పడడానికి..

సర్వర్: "ఈ హోటల్‌కి వచ్చిన వాళ్ళు మళ్లీ మళ్లీ వస్తుంటారు" అన్నాడు.

కస్టమర్: "మీ హోటల్లో అంత బాగా ఉంటుందా ఫుడ్?"

సర్వర్: "ఫుడ్ గురించి కాదు.. వాళ్ళకి వచ్చిన ఆరోగ్య సమస్యలకు గొడవ పడడానికి!" సమాధానమిచ్చాడు.

### అప్పులున్నాయి..

పైలట్: "ఇంజన్‌లో ప్రాబ్లం వచ్చింది. ఫ్యూయల్ ఫిల్టర్ అవ్వడం లేదు".

ఫస్ట్ ఆఫీసర్: "అలాంటప్పుడు ఇంతకుముందే వేరే ఎయిర్ పోర్ట్ వచ్చింది కదా.. అక్కడ ల్యాండ్ ఎందుకు చేయలేదు?"

పైలట్: "కావాలనే చెయ్యలేదు.. నాకు ఆర్థిక సమస్యలు బాగా ఉన్నాయి. బతికి ఏం ఉపయోగం?"

### దొంగనోట్లున్నాయి..

పోలీస్: "నువ్వు ఆ ఇంట్లో దొంగతనం చేసావు కదా! డబ్బంతా వదిలేసి కేవలం గోల్డ్ మాత్రమే తీసుకెళ్ళావు ఏంటి?"

దొంగ: "ఆ ఇంట్లో దొంగ నోట్లు ప్రింట్ చేసే ప్రింటర్ ఉంది కాబట్టి ఆ డబ్బు తీసుకుని వెళ్తే బయట దొరికిపోతా కదా!"

### ముందు జాగ్రత్తగా..

ప్రేయసి: "ఈ మధ్య పొద్దున్నే రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తున్నావు ఏంటి? స్పోర్ట్స్‌లో ట్రై చేస్తున్నావా?"

ప్రియుడు: "మన విషయం మీ ఫాదర్‌కి తెలిసింది. నన్ను కొట్టడానికి మనుషుల్ని పంపితే సిద్ధంగా ఉండాలి కదా!" అన్నాడు తెలివిగా.

### వారం రోజులు..

పేషంట్: "మీరు ఇంజెక్షన్ చేతికి ఇవ్వండి. తుంటికి చేస్తే రోజంతా నొప్పి ఉంటుంది."

కాంపౌండర్: "నేను తుంటికి ఇస్తే నొప్పి ఒక్క రోజే ఉంటుంది.. చేతికి ఇస్తే వారం రోజులు ఉంటుంది మరి" అన్నాడు లౌక్యంగా.

### మీటింగ్

పని మనిషి: "అమ్మగారూ, రేపు నేను పనిలోకి రావట్లేదు" అంది.

యజమాని: "ఎందుకు? ఆరోగ్యం బాగా లేదా??"

పని మనిషి: "పాత్రలు ఎలా కడగాలి, బట్టలు ఎలా ఉతకాలి, ఇంటిని ఎలా క్లీన్ చెయ్యాలి అనే వాటి మీద మాకు మీటింగ్ ఉందమ్మా"

– ఎస్.కె.యాకూబ్ పాషా, ఖమ్మం

అనిల్: "తలకి ఆపరేషన్ అయిన తరువాత ఏమీ సరిగ్గా గుర్తు ఉండడటం లేదు" అన్నాడు భార్యతో.

విజ్జి: "ఔనా సరే. జాగ్రత్తగా ఉండాలయితే. మరి నాకు ఇవ్వాల్సిన ఆరు వేలు గుర్తున్నాయా? లేదా ? అవి ఎప్పుడు ఇస్తావు?" అడిగింది.

అనిల్: "ఆరు వేల సంగతి గుర్తు లేదు. కానీ ఒక్కసారిగా మూడు వేలు పెంచడం బాగాలేదు" అన్నాడు.

– ఈ.ఎస్.మాధవన్




## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు... వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080**

**sunmagvaartha@gmail.com**

## 'సంఘీ' భావం



# అత్యాచార కేసుల్లో న్యాయం ఆలస్యం

మహిళలపై జరిగే నేరాలు, అత్యాచారాలు. లైంగిక వేధింపుల నివారణకు సంబంధించి అనేక చట్టాలు ఉన్నప్పటికీ వారికి సరైన న్యాయం జరగడం లేదు. విద్యాసంస్థల్లో చిన్నారులపై సైతం అత్యాచారాలు, లైంగిక వేధింపు సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అయితే ఇవి చాలా వరకు పోలీసు కేసుల వరకు వెళ్లడం లేదు. కుటుంబ గౌరవం రోడ్డున పడుతుందని, ఆడపిల్ల జీవితం నాశనం అవుతుందని చాలా కుటుంబాలు ఈ విషాదాన్ని బయటకు పొక్కనివ్వడం లేదు. కొన్ని కేసులు మాత్రమే పోలీసు స్టేషన్లకు, అక్కడి నుంచి న్యాయస్థానాలకు వెళతాయి. అయితే ఈ విషయంలో నేరస్తులు కేసుల నుంచి బయటపడేందుకు అనేక విధానాలను అనుసరిస్తారు. ప్రధానంగా సాక్ష్యాలను మట్టుబట్టేందుకు ప్రయత్నాలు చేస్తారు. కొన్ని సందర్భాల్లో పోలీసులు కూడా నిందితులకు సహకరిస్తారు. ఉదా: తెలంగాణలో కొన్ని సం॥ల క్రితం ఒక రాజకీయ నాయకుడు తన ఇంట్లో పనిచేసే మైనర్ బాలికపై అత్యాచారం చేశాడు. సుమారు 70 యేళ్లు పైబడిన ఈ వ్యక్తి చేసిన నిర్వాకం వల్ల ఆమె గర్భం దాల్చింది. ఈ విషయం మీడియా దృష్టికి వెళ్లడంతో ఒక్కసారిగా రాష్ట్రవ్యాప్తంగా సంచలనానికి దారి తీసింది. రాజకీయ పలుకుబడి అధికంగా ఉండటంతో పాటు డబ్బుకు తక్కువ లేకపోవడంతో అన్ని వైపుల నుంచి ప్రయత్నాలు సాగించి కేసు నుంచి బయటపడ్డాడు. సుమారు 20 నుంచి 30 లక్షల రూపాయలు వెచ్చించినట్లు ప్రచారం జరిగింది. చివరకు తన కుమార్తెపై అత్యాచారం జరిగిందన్న తల్లిదండ్రులు కూడా కేసు నుంచి పక్కకు తప్పుకున్నారు. అందరికీ వాస్తవం తెలిసినప్పటికీ ఈ కేసు ముందుకు సాగలేదు. ఇలాంటి ఘటనలు చాలా ఉన్నాయి. కోర్టుకు వెళ్లిన కుటుంబాలకు న్యాయం జరగకపోగా ఇంటి బిడ్డ అత్యాచారానికి గురైందని ప్రచారం జరగడంతో మరింత ఆవేదనకు గురౌతున్నారు. దేశవ్యాప్తంగా కేసులను పరిశీలిస్తే కనీసం పది శాతం కేసుల్లో కూడా నిందితులకు శిక్ష పడటం లేదు. ఇది స్వయంగా జాతీయ నేరాల రికార్డ్స్ బ్యూరో అందించిన నివేదిక ద్వారా తెలిసింది. ఏటా సుమారుగా దేశవ్యాప్తంగా 30 వేల కేసులు న్యాయస్థానాలకు వెళితే అందులో కేవలం నాలుగు వేల మందికి మించి శిక్షలు పడటం లేదు. వాటిలో ఒకటి రెండు సంవత్సరాల శిక్ష మాత్రమే పడిన కేసులు సగానికి పైగా ఉంటున్నాయి. సంవత్సరాల వారీగా పరిశీలిస్తే 2018లో 33,356 అత్యాచార కేసులు నమోదు అయితే అందులో కేవలం 4,708 మందికి మాత్రమే శిక్షలు పడ్డాయి. అదేవిధంగా 2019లో 32,033 అత్యాచార కేసులకు గాను 4,640 మందికి, 2020లో 28,046 కేసులకు గాను 3,814 మందికి, 2021లో 31,677 కేసులకు గాను 3,368 మందికి, 2022లో 31,516 కేసులకు గాను 5,067 మందికి, 2023లో 29,670 కేసులకు గాను 4,464 మందికి శిక్షలు పడ్డాయి. పోలీసు రికార్డులకు ఎక్కని అత్యాచారాల కేసులు సుమారుగా పది రెట్లు ఉంటాయి. ఇక అత్యాచారయత్నం, లైంగికవేధింపుల కేసులు చాలా వరకు వెలుగుచూడటం లేదు. తెలంగాణలోని జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఒకరు తమను లైంగికంగా వేధిస్తున్నాడని 25 మంది మహిళలు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. దీనితో అధికారులు సదరు ఉద్యోగిని సస్పెండ్ చేశారు. అయితే ఇలాంటి కేసులు కోర్టుల్లో సంవత్సరాల తరబడి కొనసాగుతాయి. ఫోక్సో కేసులకు మాత్రం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ కూడా శిక్ష ఖరారు కావడానికి కనీసం సంవత్సర కాలం పడుతుంది. కేసుల వాయిదాలకు అత్యాచారానికి గురైన మహిళ హాజరుకావాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో బహిరంగంగా కాకుండా న్యాయమూర్తి ఛాంబర్‌లో విచారణ కొనసాగిస్తారు. దీనివల్ల బాధిత మహిళకు కొంతవరకు ఉపశమనం ఉంటుంది. అలా కాకుండా బహిరంగ కోర్టులో విచారిస్తే నిందితుడి తరపు న్యాయవాది వేసే ప్రశ్నలకు బాధిత మహిళ ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. అత్యాచారానికి గురైన మహిళ ఎంతో వేదనను, మానసిక సంఘర్షణకు లోను అవుతుంది.

ఈ సమయంలో పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడం ఒక సాహసోపేత నిర్ణయంగా చెప్పుకోవచ్చు. తనపై అత్యాచారం జరిపిన వ్యక్తికి శిక్ష పడేలా చేయాలన్న ఆమె ప్రయత్నం నెరవేరేం దుకు అనేక ఇబ్బందులు ఎదురౌతాయి. ఒకవేళ నిందితుడిని అరెస్ట్ చేసినా బెయిల్‌పై బయటకు వచ్చి స్వేచ్ఛగా తిరగడం బాధిత మహిళకు మరింత ఆందోళనకు, ఆవేదనకు గురి చేస్తుంది. అత్యాచార చట్టాలను మరింత కఠినం చేయడంతో పాటు కేవలం కొన్ని నెలల్లోనే కేసు పరిష్కారం జరిగి తీర్పు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటేనే బాధిత మహిళలకు సరైన న్యాయం జరుగుతుంది. మరొకరు ఇలాంటి నేరాలు చేయడానికి వెనుకంజ వేసే పరిస్థితి నెలకొంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

షేక్ అబ్దుల్ హకీం జాని

# ర్యాంకుల వేటలో ఆటలు మాయం!



**బాల్యంలో** ఆడుకోవడం అనేది పిల్లల హక్కు కానీ ఆ హక్కు క్రమంగా కనుమరుగౌతుందని చాలామంది ఆవేదన వ్యక్త చేస్తున్నారు. కారణం.. దేశవ్యాప్తంగా అనేక ప్రైవేటు పాఠశాలలు కాంక్రీటు గోడలతో నిర్మించిన పెద్ద భవనాలలోనే తరగతులు నిర్వహిస్తున్నాయి. అపార్ట్‌మెంట్లలో పాఠశాల నిర్వహణ సంస్కృతి పెరిగిపోయింది. ఫలితంగా క్రీడా మైదానాలు లేని పాఠశాలలు పెరిగాయి. ఒకవేళ ఏదో ఒక క్రీడామైదానాన్ని చూపించి పాఠశాలలు గుర్తింపు పొందినప్పటికీ అన్ని రకాల క్రీడలను ఆడించడం అనేది కనుచూపుమేరలో కానరావడం లేదు. ఫలితంగా విద్యార్థులు పుస్తకాల్లో మాత్రమే బంధింపబడి, శారీరక అభివృద్ధి వెనుకబడిపోతున్నారు. శారీరక విద్యను కేవలం పాఠ్యాంశం రూపంలోనే పరిమితం చేస్తున్నారు. ఇది పిల్లల ఆరోగ్యం, మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దేశంలోని చాలా పాఠశాలల్లో సరైన క్రీడా మైదానాలు లేవు అనే విషయాన్ని తాజా విద్యా సర్వేలు చెబుతున్నాయి. క్రీడలతోనే పిల్లలలో క్రమశిక్షణ, జట్టు భావన, ధైర్యం పెరుగుతాయి, కానీ నేడు అనేక పాఠశాలల్లో ఆ అవకాశమే లేకుండా పోతోంది. పాఠశాలల్లో క్రీడా మైదానం, క్రీడలు చాలా అవసరమైనవి. ఇవి కేవలం ఆటల కోసం కాకుండా, పిల్లల మానసిక, శారీరక, సామాజిక అభివృద్ధికి కీలకం, పిల్లలు పాఠశాలగదుల్లో బందీలుగా మారి పుస్తకాలకే పరిమితమై మార్కులు, ర్యాంకులు అంటూ పరుగులు తీస్తూ, ఇంటికి రాగానే పుస్తకాలను ప్రక్కన పడేసి సెల్‌ఫోన్‌కు బానిసలవడం వల్ల వారిలో శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యంతో పాటు సృజనాత్మకతకూడా కొరవడుతుంద నడంలో ఎటువంటి సందేహం లేదు. కొందరు విద్యార్థులు ఏదో ఒక క్రీడారంగంలో ప్రావీణ్యం సంపాదించి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదగాలని కలలు కంటున్నారు. పాఠశాలస్థాయిలోనే వారికి క్రీడామైదానాలు లేకపోవడం వల్ల వాళ్ల కలలు కల్లలుగానే మిగిలిపోతున్నాయి. వాటిని సాకారం చేసుకోలేకపోతున్నారు. "క్రీడ అంటే స్నేహం, క్రీడంటే ఆరోగ్యం, క్రీడ అంటే విద్య, క్రీడే జీవితం, క్రీడలు ప్రపంచాన్ని ఏకతాటిపైకి తెస్తాయి" అని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ మాజీ అధ్యక్షుడు జువాన్ ఆంటోనియో సమరాంచ్ చెప్పిన మాటలు అక్షర సత్యాలు. ఈ భువిపై నివసించే మానవులందరికీ ఇవి వర్తిస్తాయి. "జీవితంలో ముఖ్యమైన విషయం విజయం కాదు పోరాటం, క్రీడల్లోనూ అంతే. గెలవడం కాదు, పాల్గొనడం" అంటారు ఆధునిక ఒలింపిక్ ఉద్యమ స్థాపకులు పియరీ డి కూబెర్టిన్. "జీవించడంలో ఉన్న గొప్ప మహిమ ఎప్పుడూ పడకపోవడంలో కాదు, పడిపోయిన ప్రతిసారీ లేవడంలోనే ఉంది" అంటారు నెల్సన్ మండేలా. ఇది కూడా క్రీడాస్ఫూర్తిని తెలియజేస్తుంది. ఆటలాడటం అనేది మనుషులకు జన్మతః లభించే సహజ లక్షణం.

## క్రీడలు ఎందుకు ఆడాలి?

క్రీడలు శరీరానికే కాదు, మానసిక ఆరోగ్యానికి కూడా దోహదపడతాయి. ఆందోళన, దిగులు, కుంగుబాటు వంటి మానసిక సమస్యలను అధిగమించడానికి వ్యాయామం, క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఎ) నిపుణులు తేల్చి చెప్పారు.

క్రీడల ద్వారా పిల్లలు శరీరాన్ని కదిలిస్తారు. వ్యాయామం అవుతుంది. స్థూలకాయం, మధుమేహం, వంటి సమస్యలు దూరంగా ఉంటాయి. క్రీడలు విద్యార్థుల శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయి. రన్నింగ్, ఫుట్బాల్, క్రికెట్ వంటి క్రీడలు శరీరాన్ని చురుకుగా ఉంచడమే కాక, ఊబకాయం, ఒత్తిడి వంటి సమస్యలను తగ్గిస్తాయి. శక్తి, చురుకుదనం, సంతులనం పెరుగుతుంది. మానసిక ఆరోగ్యం, సామాజిక నైపుణ్యం, మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. క్రీడలు ఒత్తిడి, భయాన్ని తగ్గించి, మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఆటలు ఆడటం వల్ల విద్యార్థులు నూతన శక్తిని పుంజుకుని చదువుపై ఏకాగ్రతతో పాటు ఆసక్తి కూడా పెరుగుతుంది. ఎందుకంటే మెదడు చురుకుగా ఉంటుంది.

జట్టుగా పనిచేయడం వల్ల నాయకత్వ లక్షణాలు, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి, విజయాలు, పరాజయాలను సులభంగా స్వీకరించే మనోభావం ఏర్పడుతుంది. ఆటల్లో సమయపాలన, నియమాల పట్ల గౌరవం నేర్చుకుంటారు. ఈ క్రమశిక్షణ జీవితం మొత్తం ఉపయోగపడుతుంది. మంచి క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చూపి పేరు సంపాదించవచ్చు. ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడా కోటా ద్వారా అవకాశాలు లభిస్తాయి. క్రీడా మైదానం లేకుంటే పిల్లలు బయట ఆడే అవకాశమే ఉండదు.

పిల్లలు క్రీడలు ఆడకపోవడం వల్ల శారీరక చలనం తగ్గి ఆరోగ్య సమస్యలు వస్తాయి. స్కూల్ వాతావరణం బోరింగ్గా మారుతుంది. క్రీడలు పాఠశాల విద్యలో ఒక విడదీయలేని భాగం. క్రీడా మైదానం ఉన్న పాఠశాలలు మాత్రమే పిల్లల సంపూర్ణ అభివృద్ధికి మార్గం చూపగలవు. క్రీడల్లో వ్యూహాత్మక ఆలోచన, తక్షణ నిర్ణయాలు తీసుకోవడం అవసరం. ఇది విద్యార్థుల స్వజనాత్మక ఆలోచనను పెంపొందిస్తుంది.



క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు చురుకుగా ఉండి తమ చదువుల్లో మెరుగైన పనితీరు కనబరుస్తారు. క్రీడా మైదానం లేకుండా, విద్యార్థులు ఈ ప్రయోజనాలను పొందలేరు. వారి సర్వతోముఖాభివృద్ధి పరిమితం అవుతుంది. అందుకే పాఠశాలల్లో క్రీడలు, క్రీడా మైదానం అత్యంత అవసరం, క్రీడలు జీవసతత్వాన్ని కూడా బోధిస్తాయి. క్రీడా స్ఫూర్తి కలిగినవారు ఎవరైనా సరే జీవితంలో ఎటువంటి సమస్య ఎదురైనా ధీటుగా ఎదుర్కోగలుగుతారు. అందుకే ప్రాచీన భారతదేశంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇచ్చేవారు. మార్షల్ ఆర్ట్స్, విలువిద్య, కత్తిసాము, బరువులు ఎత్తడం ఇత్యాదిని చేయించేవారు. కానీ రాను రాను ఈ క్రీడా సంస్కృతి దేశంలో కనుమరుగౌతుందనే భయాందోళనలు మొదలైనాయి.

## అభివృద్ధి చెందిన దేశాలలో క్రీడల ప్రాముఖ్యత

అమెరికా, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి అనేక అభివృద్ధి చెందిన దేశాల్లోని పాఠశాలల్లో పిల్లల క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇక్కడ క్రీడలు ప్రణాళికాబద్ధంగా, విద్యా విధానంలో ఒక భాగంగా నిర్వహిస్తారు. క్రీడా పరికరాలు, మైదానాలు, అథ్లెటిక్ ట్రాక్లు, జిమ్నాస్టిక్ హాల్లు, ఇండోర్, అవుట్డోర్ ప్లేగ్రౌండ్లు ఇత్యాదివి అత్యుత్తమ నాణ్యతతో, వివిధ రకాల ఆటలకు అనుగుణంగా ఉంటాయి. క్రీడలు కేవలం ఆటలు మాత్రమే కాకుండా, విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి ఒక ముఖ్యమైన భాగంగా పరిగణిస్తారు. విద్యార్థులు వివిధ రకాల క్రీడలలో పాల్గొనేలా ప్రోత్సహిస్తారు. అవి బాస్కెట్బాల్, వాలీబాల్, ఫుట్బాల్, టెన్నిస్, స్విమ్మింగ్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్ వంటివి. అభివృద్ధి చెందిన దేశాల పాఠశాలల్లో అత్యాధునిక క్రీడా సౌకర్యాలు ఉంటాయి. ఇండోర్, అవుట్డోర్ ప్లేగ్రౌండ్లను పలు రకాల క్రీడలు ఆడటానికి ఉపయోగిస్తారు. అనేక పాఠశాలల్లో స్విమ్మింగ్ కోసం స్విమ్మింగ్ పూల్స్ ఉంటాయి. క్రీడా పరికరాలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటాయి. అన్ని వయసుల పిల్లల కోసం ఆటల పరికరాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు రెండూ క్రీడల ప్రోత్సాహానికి క్రీడా పరికరాలు, మైదానాలను సమకూరుస్తాయి, పాఠశాలల మధ్య, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తారు. ఈ విధంగా అభివృద్ధి చెందిన దేశాల పాఠశాలల్లో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తారు. ఆయా దేశాలలో క్రీడలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని వారు సంపూర్ణంగా విశ్వసిస్తారు.

## భారతదేశంలో తల్లిదండ్రుల అభిప్రాయం

మన దేశంలో కొందరు తల్లిదండ్రులు క్రీడల వల్ల సమయం వృథా అనే భావనలో ఉన్నారు. మార్కులు, ర్యాంకులు వస్తే చాలు పిల్లల భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందనే భ్రమలో కొందరు ఉన్నారు. కేవలం ఇంజినీరింగ్, మెడిసిన్ పరీక్షలకే సిద్ధం చేయాలనే తపనతోనే ఉంటారు. ఈ కారణంగా క్రీడలకు తక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాల్లో పిల్లలు చదువులో మెరుగ్గా ఉండాలని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. అయితే కొత్త తరానికి చెందిన కొందరు తల్లితండ్రుల దృష్టి మారింది. శారీరక ఆరోగ్యానికి క్రీడలు చాలా అవసరం అని వారు భావిస్తున్నారు. ఆ కారణంగానే క్రీడలు కనుమరుగు కాకుండా కొన్ని చోట్లన్నా కనిపిస్తున్నాయి.

ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో క్రీడల ఆధారంగా రిజర్వేషన్లు, ఉద్యోగ అవకాశాలు కూడా వస్తున్నాయి. భారతదేశం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో కూడా క్రీడల్లో ఎదుగుతోంది. పి.వి.సింధు, శీతల్దేవి లాంటి వారిని ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. అందువల్ల కొంతమంది తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో పాల్గొనమని ప్రోత్సహిస్తున్నారు. నగర ప్రాంతాల్లో ఈ శాతం కొంచెం ఎక్కువగా ఉంది. అయినప్పటికీ భారతదేశంలో సుమారు 70 శాతం పైబడి తల్లిదండ్రులు ఇప్పటికీ విద్యను ప్రధానంగా చూస్తున్నారు. 30 శాతంలోపు తల్లిదండ్రులు మాత్రమే క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని సర్వేలు చెబుతున్నాయి.

గ్రామాల్లో ఇంకా చదువు, మార్కుల దృష్టికోణమే ఎక్కువ. నేడు పాఠశాలల్లో 2020 జాతీయ విద్యా విధానం) ప్రకారం క్రీడలు కూడా విద్యలో భాగమే అని ప్రభుత్వం చెబుతోంది. కొన్ని రాష్ట్రాలు తప్పనిసరిగా క్రీడలు నిర్వహించమని చెబుతున్నాయి. దీంతో భవిష్యత్తులో తల్లిదండ్రుల దృష్టిలో కూడా క్రీడల ప్రాముఖ్యం పెరగవచ్చు అని నిపుణుల అంచనా.



2025 స్పోర్ట్స్ విలేజ్ సర్వే వారు 1,800 మంది పిల్లలు, తల్లిదండ్రుల నుంచి అనేక వివరాలు సేకరించారు. 99 పిల్లలు క్రీడలు ఆడటాన్ని ఇష్టపడతారు. 96 స్కూల్ టీమ్లలో చేరాలని కోరుకుంటారు. 86 తల్లిదండ్రులు పిల్లలు క్రీడల్లో కెరీర్ చేయాలనుకుంటే మద్దతు ఇస్తారు. కానీ అకడమిక్స్‌తో సమతుల్యత, అవకాశాల కొరత, సెలక్షన్ ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం వంటి ఆందోళనలు ఉన్నాయి. కేవలం తరగతి గదులు ఉంటే అది పాఠశాల అనిపించుకోదు.సువిశాలమైన క్రీడా మైదానం ఉన్నప్పుడే అది పాఠశాల అవుతుంది. ఈ నిబంధన నేటి తరం పాఠశాలలకు వర్తించదు. ఎందుకంటే నేడు పట్టణాల్లో కానీ నగరాలలో కానీ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో అధిక భాగం బహుళ అంతస్తుల భవనాల్లో, గాలి వెలుతురు లేని ఇరుకు గదుల్లో విద్యనభ్యసించే విద్యార్థులే అధికంగా కనిపిస్తున్నారు. పాఠశాల, కళాశాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలంటే కచ్చితంగా మైదానం ఉండి తీరాలి.

కానీ వాస్తవంలో ఈ నిబంధన కాగితాలకే పరిమితం, క్రీడలను ప్రోత్సహించడమే మా ధ్యేయం అని చెప్పుకొనే ప్రభుత్వాలు క్రీడా సౌకర్యాలు చూపని విద్యా సంస్థలకు అనుమతులు ఇచ్చేస్తున్నాయి. పైగా వ్యాయామ ఉపాధ్యాయులు పోస్టులు భర్తీ చేయడం ప్రభుత్వ ఖజానాకు భారంగా నేటి ప్రభుత్వాలు భావిస్తున్నాయి. కనీస క్రీడాసౌకర్యాలు లేని పాఠశాలల్లో చదివే నేటితరం బాలలకు ఆటలు అడే కనీస సదుపాయాలు లేకపోవడాన్ని మించిన విషాదం మరొకటి లేదనే చెప్పవచ్చు. దీని కారణంగా బాల్యంలో ఊబకాయంతో బాధపడేవారు మనకు తరచూ కనిపిస్తున్నారు. ఊబకాయంతో పాటు రోగ నిరోధక శక్తి క్షీ ణించి తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. ఆటలు పాటలు వద్దు మా పిల్లలకు చదువే ముద్దు అంటూ పిల్లల బాల్యాన్ని నిలువునా చిదిమేస్తున్న తల్లిదండ్రులు ఎందరో ఉన్నారు. నేడు క్రీడలు ఆడే వారి కన్నా చూడటానికి ఇష్టపడే వారు ఎక్కువై పోయారు, ప్రధానంగా నేటి తరం పిల్లలు ఎక్కువగా ఎలక్ట్రానిక్ ఆట వస్తువులతో ఎక్కువ సమయం గడపడం వల్ల క్రీడల పట్ల ఆసక్తి తగ్గిపోయింది. నిత్యం ఏదో ఒక వాహనంలో బడికి బయలుదేరడం, సాయంకాలం మళ్లీ వాహనంలోనే ఇంటికి రావడం, వచ్చీరాగానే టీవీ, కంప్యూటర్, ఫోన్ ఇత్యాది వాటితో కాలక్షేపం చేస్తున్నారు. ఇదీ నేటి పిల్లల దైనందిన జీవితం. ఇదిలాగే కొనసాగితే 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా అయిదు వందల మిలియన్ల కొత్త దీర్ఘకాలిక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తుంది. ఈ పరిస్థితి నుండి గట్టెక్కాలంటే పిల్లలకు శారీరక శ్రమ కలిగేలా ఆడించాలని చెబుతున్నారు నిపుణులు, నిత్యం అలుపెరిగేలా ఆటలు ఆడితేనే పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో భారతదేశంలో 12-15 యేండ్ల పిల్లలకు కూడా దయాబెటీస్ రావడం ఆందోళన కలిగించే అంశం. ఇంతకు ముందు 50-60 యేండ్ల వారికి గుండెజబ్బులు వచ్చేవి. నేడు 35-40 యేండ్లకే గుండెపోటు రావడానికి ప్రధాన కారణం శారీరక వ్యాయామం లేకపోవడమే.

## బాధించే చేదు నిజాలు

మన దేశంలో పలు క్రీడలకు చెందిన మొత్తం 25 మంది అర్జున అవార్డీల బృందంతో ఇటీవలే నిర్వహించిన ఓ సర్వేలో భారత క్రీడారంగం వెనుకబాటుకు అనేక చేదు నిజాలు వెలుగులోకి వచ్చాయి. 140 కోట్ల పైబడి ఉన్న భారత జనాభాలో కేవలం 5.2 శాతం మందికి మాత్రమే క్రీడల గురించి కనీస అవగాహన ఉన్నట్లుగా ఈ సర్వే ద్వారా తేలింది. అంతకన్నా ఆశ్చర్యపోయే విషయం ఏమిటంటే జనాభాలో సగ భాగం ఉన్న మహిళల్లో కేవలం 1.31 శాతం మందికి మాత్రమే క్రీడల గురించి అవగాహన ఉంది. మొత్తం మీద దేశజనాభాలో 3.27 శాతం మంది మాత్రమే క్రీడల గురించి తెలుసుకోడానికి ఆసక్తి చూపుతున్నట్లు పరిశీలనలో వెల్లడయ్యింది. క్రీడారంగంలో భారత్ ఇంకా కొంత వెనుకబడే ఉంది. ప్రపంచవ్యాప్తంగా క్రీడల్లో అగ్రగాములుగా నిలుస్తున్న దేశాల జాబితాలో భారత్ ఇంకా తొలి పది స్థానాల్లో చోటు పొందలేదు. నాలుగేండ్లకు ఒకసారి వెలువడే ఈ జాబితాల ప్రపంచంలో క్రీడలలో అగ్రస్థానంలో ఉన్న 10 దేశాల జాబితా ప్రకారం అమెరికా సంయుక్త రాష్ట్రాలు, చైనా, జర్మనీ, బ్రిటన్, జపాన్, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్ ఇత్యాదివి, భారత్ మాత్రం ఈ జాబితాలో 37వ స్థానంలో ఉంది..

## బాలల క్రీడల చట్టాలు

మనదేశంలో క్రీడలను విద్యలో భాగంగా పరిగణిస్తారు. ముఖ్యంగా పిల్లల సమగ్రాభివృద్ధికోసం క్రీడల విషయంలో అనేక చట్టాలు చేశారు.

**విద్యా హక్కు చట్టం (2009):** ఈ చట్టం ప్రకారం పాఠశాలలు సమగ్ర విద్యను అందించాలి. ఇందులో శారీరక విద్య, క్రీడలు కూడా ఉంటాయి. శారీరక విద్యను పాఠ్యాంశంలో తప్పనిసరిగా పరిగణిస్తారు, ఎందుకంటే ఇది పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుంది. పాఠశాలలు ఆట స్థలాలు, క్రీడా సామగ్రి, శారీరక విద్య ఉపాధ్యాయులను అందుబాటులో ఉండాలి.

**జాతీయ విద్యా విధానం (2020):** ఈ చట్టం ప్రకారం క్రీడలు, శారీరక విద్యను పాఠశాల విద్యలో అంతర్భాగంగా చేయాలని సిఫార్సు చేశారు. ఇది విద్యార్థులలో శారీరక, మానసిక, సామాజిక మొ॥ సమగ్రాభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. క్రీడలు, యోగా, ఇతర శారీరక కార్యకలాపాలను పాఠ్యాంశంలో భాగంగా చేర్చడం ద్వారా వీటిని ఆసక్తికరంగా మార్చడం, స్థానిక సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించడం ఇందులో ప్రధాన లక్ష్యం.

**ఖేలో ఇండియా:** భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ద్వారా క్రీడలను



ప్రోత్సహిస్తుంది. ఖేలో ఇండియా వంటి కార్యక్రమాలు బాలల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి రూపొందించారు. పాఠశాల స్థాయిలో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించడం ద్వారా బాలల్లో ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడం జరుగుతుంది. క్రీడలతో పాటు చదువులోనూ రాటుదేలేలా చేయటమే ప్రధాన లక్ష్యంగా 2017-18లో ఖేలో ఇండియా అనే వినూత్న కార్యక్రమాన్ని కేంద్రం ప్రారంభించింది. 1756 కోట్ల రూపాయలతో ప్రత్యేక బడ్జెట్ను కూడా ఏర్పాటు చేశారు.

**ఫిట్ ఇండియా ఉద్యమం:** యూత్ ఫిట్‌గా ఉంటేనే దేశం ఫిట్‌గా ఉంటుందనే ఉద్దేశంతో 2019లో జాతీయ క్రీడా దినోత్సవమైన ఆగస్టు 29న ఫిట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిచ్చారు. గతంలో శారీరక శ్రమతో మనుషులు దృఢంగా ఉండేవారు. ఇప్పుడు సమయాభావం, పనులు భిన్నంగా ఉండటం వల్ల ఫిట్‌నెస్‌కు దూరమయ్యారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రతి ఒక్కరూ ఫిట్‌గా ఉండటానికి రోజూ వ్యాయామం, వాకింగ్, జాగింగ్ లాంటివి తప్పనిసరి చేసే విధంగా చర్యలు చేపట్టారు. అయితే ప్రభుత్వాలు ఆర్భాటంగా విభిన్న పథకాలు ప్రవేశపెట్టినా వాటి అమలుకు కావలసిన నిధులు అరకొరగానే ఉంటున్నాయి. భారతదేశంలో బాలల క్రీడలు విషయంలో చట్టాలు ఉన్నాయి. అయితే మౌలిక సదుపాయాల కొరత, శిక్షణ లేకపోవడం ఇత్యాది అనేక కారణాల వల్ల బాలల క్రీడల విషయంలో అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నాము.

## క్రీడలు పిల్లల హక్కు

ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై 2018 ఆగస్టులో సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్పందనను కోరింది. అనంతరం కోర్టు 2019 ఏప్రిల్ శంకర్ నారాయణ్‌ను అమికస్‌గా నియమించింది. క్రీడలకు బదులుగా భౌతిక అక్షరాస్యత అనే విస్తృత పదాన్ని స్వీకరించాలని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ద్వారా రక్షణ కల్పించిన ప్రాథమిక హక్కుగా గుర్తించాలని ఆయన సూచించారు. అన్ని ఎడ్యుకేషన్ బోర్డు తప్పనిసరిగా ప్రతి పాఠశాల రోజులో కనీసం 90 నిమిషాలు ఉచిత ఆటలకు అంకితమివ్వాలని కోరింది. అలాగే ఢిల్లీ డైలాగ్ కమీషన్ 'ఆడే హక్కు పిల్లల హక్కు'గా పరిగణించాలని 'క్రీడలకు మార్కులు' వంటి పథకాలను తేవాలని రాష్ట్ర క్రీడల బిల్లును రూపొందించాలని కూడా సూచనలు చేసింది. అయితే ఈ సూచనలు అన్నీ కూడా నేటికీ కాగితాలకే పరిమితమయ్యాయి. ఆ కారణంగా మనం అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లో వెనుకపడి ఉన్నాం. క్రీడలపై మక్కువతో పిల్లలు అనేక పట్టణాలలో రోడ్లపైనే గల్లీ క్రికెట్ ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు.

## కామన్వెల్త్

భారత్ 1934 నుంచి కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొంటోంది. ఇప్పటివరకు మొత్తం 564 పతకాలను సాధించి భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. అందులో 203 బంగారు, 190 రజతం, 171 కాంస్య పతకాలు ఉన్నాయి. ఢిల్లీ వేదికగా జరిగిన 2010 కామన్వెల్త్ గేమ్స్ భారత్ అత్యధికంగా 101 పతకాలు దక్కించుకుని చరిత్ర సృష్టించింది. బర్మింగ్హామ్ వేదికగా జరిగిన గేమ్స్‌లో ఫర్వాలేదనిపించి 61 పతకాలతో సరిపెట్టుకుంది.

## ఒలింపిక్స్ వెనుకంజ

భారత్ ఒలింపిక్స్‌లో ఇప్పటివరకు కేవలం 35 పతకాలను మాత్రమే సాధించింది. అందులో 10 స్వర్ణం, తొమ్మిది రజతం, 16 కాంస్య పతకాలు ఉన్నాయి. టోక్యో వేదికగా జరిగిన 2020 ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా తొలిసారి జావెలిన్ త్రో విభాగంలో స్వర్ణం గెలిచి చరిత్ర సృష్టించాడు. ఆ ఒలింపిక్స్‌లో మొత్తం ఏడు పతకాలను భారత్ దక్కించుకుంది. ఇవే భారత చరిత్రలో అత్యధిక పతకాలు సాధించిన ఒలింపిక్స్ కావడం విశేషం. క్రీడలు ఉమ్మడి జాబితా అంశం కావడంతో ఓ స్పష్టమైన క్రీడావిధానం అంటూ..

లేకపోడం భారత క్రీడారంగాన్ని కుదేలయ్యేలా చేస్తోంది. అది చాలదన్నట్లు ఏడాది నుంచి ఎనిమిదేండ్ల పిల్లలను క్రీడల పట్ల ఆకర్షించేలా చేయడంలో మన ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, ఎలాంటి విధానాలు లేవని మాజీ క్రీడాదిగ్గజాలు అంటున్నారు. ఈ విషయంలో భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు క్రీడా సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారం దిశగా అడుగులు వేయాలనే సంకల్పంతో 2012, ఆగస్టు 29వ తేదీని జాతీయ క్రీడా దినోత్సవంగా ప్రకటించింది. వ్యాయామ విద్య ప్రాధాన్యతను మన దేశంలో స్వాతంత్య్రం లభించిన తొలినాళ్ళలోనే గుర్తించారు. దాని ద్వారానే భావితరాన్ని బలోపేతం చేయాలని 1948లో డాక్టర్ తారాచంద్ కమిటీ సూచన కూడా చేసింది. ఆ తరువాత కాలంలో కుంజ్రు, సీడీ దేశముఖ్ సంఘాలు క్రీడల ప్రాధాన్యతను నొక్కి చెప్పాయి. ఇలా దశబ్దాల తరబడి ఎన్నో ఆదర్శ సూచనలు చేస్తూ రావడం జరుగుతూ ఉంది. తాజాగా 2005 జాతీయ పాఠ్యప్రణాళిక చట్టం, తరవాతి విద్యాహక్కు చట్టం ఆటపాటలతో కూడిన చదువులకే మద్దతు పలికాయి అయినప్పటికీ ఆ సూచన అన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. ఎందుకంటే ఈ రోజుకు కూడా దేశవ్యాప్తంగా సుమారు నలభై మూడు శాతం సర్కారి బడుల్లో ఆటస్థలాలే లేవని పార్లమెంటరీ స్థాయి సంఘం రెండేండ్ల కిందట తేటతెల్లం చేసింది.



## క్రీడాభివృద్ధికి నిధులేవీ?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో క్రీడలకు నిధులు కేటాయించడంలో, ఖర్చు చేయడంలో అలసత్వం, ప్రాధాన్యత లేని అంశంగా చూడటమే క్రీడాకారులకు నేడు శాపంగా మారింది. గత పదేండ్లుగా కేంద్ర బడ్జెట్ పరిశీలిస్తే 2014-15లో రూ.1769 కోట్లు కేటాయించగా ఇది వరుసగా 1943, 2197, 2596, 2776, 2826 కోట్ల రూపాయలు కేటాయించారు. 2024-25లో రూ.3442 కోట్లు గతేడాది కన్నా రూ.45 కోట్లు పెంచారు. దీన్నిబట్టి చూస్తే బడ్జెట్‌లో జిడిపి పెరుగుదల ద్వారా పెరగడం తప్ప పాలకులు క్రీడలకు ఇచ్చిన ప్రాధాన్యం ఏమీ లేదని అర్థం అవుతుంది. ఇలా ఎటూ చాలని ఈ నిధులతో క్రీడలలో అద్భుత లక్ష్యాలు సాధించడం సాధ్యం కాదు.ప్రభుత్వాలు, అధినేతలు ఇప్పటికైనా ఈ విషయం గుర్తిస్తే మంచిది..

**రాజకీయ ప్రమేయం:** మన దేశంలో క్రీడాకారుల ఎంపికలో అవినీతి, బంధు ప్రీతి, పారదర్శకత లేకపోవడం ప్రతిబంధకాలు అవుతున్నాయి. క్రీడా సంఘాల నిర్వహణలో రాజకీయ నాయకుల ప్రమేయం పెరిగిపోయింది. ఈ విషయమై సర్వోన్నత న్యాయస్థానం కూడా ప్రభుత్వాలను మందలించింది. దీన్ని నివారించగలిగితే భారత క్రీడాకారులు తమ సత్తా చూపగలుగుతారు. ఒలింపిక్స్‌లో ఫలితాలు తప్పక సాధించగలుగుతారు.

**డబ్ల్యుహెచ్ఓ సూచన:** గ్లోబల్ యాక్షన్ ప్లాన్ ఆన్ ఫిజికల్ యాక్టివిటీ ద్వారా 2030 నాటికి కౌమార దశలో ఉన్నవారిలో శారీరక స్తబ్దతను 15 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయం ప్రపంచ కార్యాచరణ ప్రణాళికలో చేర్చబడింది. ఇతర అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వాలు దీనికి సహకరించాలని పిలుపునిచ్చింది. బోట్స్వానా, ఇథియోపియా, దక్షిణాఫ్రికా, జింబాబ్వే ఈ నాలుగు ఆఫ్రికన్ దేశాలలో జరిపిన ఈ అధ్యయనాల ప్రకారం నిపుణుల సూచనల మేరకు డబ్ల్యుహెచ్ ఒక ప్రకటన విడుదల చేసింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు కలసికట్టుగా పిల్లలు శారీరక శ్రమలో పాల్గొనేలా చేయడంలో క్రియాశీలన పాత్ర వహించాలి. తల్లిదండ్రులు పిల్లలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని నేర్పి, ప్రోత్సహించాలి. పాఠశాలల్లో పాఠ్యాంశాలతో పాటు బోధనేతర కార్యక్రమాలు, క్రీడలు తప్పనిసరిగా నిర్వహించాలి. సురక్షితమైన పచ్చని ప్రదేశాలు, ఆట స్థలాలు, క్రీడా సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఇప్పటికీ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం సాధ్యమేనని, ఈ విషయంలో ప్రభుత్వాలు గురుతర బాధ్యత వహించాలి.. అని ప్రకటించింది.

అనేక రాష్ట్రాలలో క్రీడామైదానాలు లేని పాఠశాలలు వందల సంఖ్యలో ఉన్నాయి. వీటిలో అనేక ప్రభుత్వ పాఠశాలలకు సైతం క్రీడామైదానాలు లేకపోవడం శోచనీయం. కొన్ని నగరాలలో బిఎంసీ క్రీడా మైదానాలు ఉపయోగిస్తున్నారు. బిఎంసి అనేది ముంబై మహానగరపాలిక సంస్థ. ఇది ముంబైలో ప్రభుత్వ పాఠశాలలను నడుపుతుంది. క్రీడా సౌకర్యాలను కూడా అందిస్తుంది. బిసీఎం శిక్షణాకారులను నియమించి విద్యార్థులకు ఉచిత శిక్షణనిస్తుంది. విద్యార్థులు పాఠశాల సమయం తరువాత కూడా ఆటలు అడవచ్చు. ప్రతిభావంతులకు ఇక్కడ చాంపియన్‌షిప్‌లకు శిక్షణనిస్తారు. ముఖ్యంగా 12 సంవత్సరాల విద్యార్థులకు సబ్సిడీలు కూడా ఉన్నాయి. అయితే ఇటువంటి క్రీడా మైదానాలు వేళ్ళపై లెక్కించదగినవి మాత్రమే మన దేశంలో ఉన్నాయి. అందువల్ల ప్రతి పాఠశాలలో విధిగా క్రీడామైదానాలను ఏర్పాటు చేసి బాల్యం నుండే పిల్లలను ప్రతిరోజు ఆటలు ఆడించాలి. అప్పుడే మనం భావిభారత క్రీడాకారులను తయారుచేసుకోగలం.

ఈ వారం కవిత్వం

# మరణం నా సేద్యం

పద్యం నా పంట
ఏమో..! ఈ వాహనం ఎక్కడికి చేరుకుంటుందో!
పడుతూ.. లేస్తూ.. నన్ను నేను కోల్పోయేలా చేసి
మరో మరణానికి చేరువ చేస్తారు.
ఎన్ని మరణాలని భరిస్తాను?
మీ సమస్య; దేహంలోని నీరు; రక్తాన్ని హత్య చేసిన
తర్వాత.. చెంగున గర్భంలోకి చేరుకుంటాను.
తల్లి పాలిండ్లలో
ఊరుతున్న
కవిత్వాన్ని నేను.
భూమిలోకి
చొచ్చుకుపోయి,
అక్షరాలుగా మొలకెత్తుతాను.
కొమ్మలు కొమ్మలుగా.. వాక్యాలుగా మారి
గగనానికి గొడుగునౌతాను.
పద్యాలుగా వర్షించి మట్టిలోని
మానవత్వాన్ని రుచి చూపిస్తాను;
మళ్ళీ హత్య చేయబడతాను..
మరణం నాకేమి కొత్త కాదు,
మీరెన్ని సార్లు నా చూపులను కాజేసినా,
మార్గాన్ని చెరిపేసినా.. గుంతలు తవ్వి కాళ్లను పూడ్చినా,
బురదను పోగేసుకొని మడుగుగా మారతాను;
మడుగులో తామరలు నవ్వుతాయి.
ఇంతకీ నేనెన్ని సార్లు మరణించాను?
పద్యాలను లెక్కపెట్టాలి,
మరణం నా సేద్యం, పద్యం నా పంట.
అదిగో..! ఖాళీ ఉదరం..
ఇదిగో ఒక పద్యాన్ని అందుకో!

– జాని తక్కెడశిల

# చైతన్యం..

పాతికేళ్ళ క్రితం..
పొలం గట్టున మా తాతయ్య
తవ్విన నీటికుంట అది..

పచ్చని చెట్టొకటి గట్టు ఒడ్డున
అందరికీ నీడనిస్తూ, సేదదీరుస్తూ..
వానలు కురిస్తే.. కుంట నిండుతుంది
అక్షయ పాత్రలా తరగదు నీరు..
అందరి దాహాన్ని తీరుస్తుంది
ఎపుడూ..
వేసవి సైతం నీళ్ళుండే
చలివేంద్రమది..
అందుకే అందరికీ కుంటంటే ప్రాణం

మరి
కాల గమనంలో ఊరికి కరువొచ్చె
బావుల్లో నీరు ఎండిపోయె..
వున్న కుంట పూడిపోయె
ప్రజలకు నీటి కష్టాలు మొదలాయె..
చాన్నాళ్ల తర్వాత ఊరెళ్ళుతూ నేను
దారిలో చెట్టుకింద విశ్రమించా..

చల్లటి గాలుల్లో సేదదీరినా,
మనసులో తెలియని వేదన..
ఆనవాళ్లు లేని కుంటను చూసి
మనసులో ఆవేదన ..
అందరి మేలు కోరిన
తాతయ్య తవ్విన కుంట
జల కళలు నిండాలనుకున్నా
ఊరిని జాగృతం చేశాను నేను.

అందరూ ఒక్కటిగా, ఐక్యమత్యం
నిండుగా
కుంట పూడిక తీశారు..చెరువు
తవ్వారు



ఇప్పుడు,
ఊరు పచ్చగా
జలసిరులు
నిండుగా
వెల్లివిరిసే
ఊరంతా
ఆనందం
మెండుగా
ఎవరో
వస్తారని, ఏదో
చేస్తారని
చక్కటి పాట
టివిలో శ్రావ్యంగా
వినిపించింది....
మధురంగా.

– కరణం హనుమంతరావు

# వాన వస్తుందే..

వాన వస్తుందే.. కానీ ఎక్కడో నుండి?
చూపుల బిందువుల మధ్య
అడుగులు నిశ్శబ్దంలో మిక్స్
అవుతున్నాయి..
మరల చూసిన ప్రతిధ్వని,
మళ్ళీ మళ్ళీ తిరిగి వస్తుంది,
అంటే, నేను విన్నది కాదు,
వీడో నా అంతరంలో ఉన్న శబ్దమా?
వేగం కాస్త తగ్గి,
కాలం మెల్లగా సర్దుకున్నప్పుడు,
ప్రతి మాట, ప్రతి ఉచ్చారణ
ఎంత లోతుగా వెళ్ళిపోతుందో,
ఎక్కడ మొదలై, ఎక్కడ ముగుస్తుందో
తెలియదు..
వాన వస్తుందే..
ఎందుకంటే ప్రతి అనేకం
ఒకే మాటగా, ఒకే శబ్దంగా మిక్స్
అవుతోంది,
అప్పుడు నేను మునిగిపోతాను
స్వరాల సముద్రంలో,
ఏమి వాస్తవం, ఏమి కల,
ఎందుకు శబ్దం, ఎందుకు నిశ్శబ్దం
ఎందుకు నేను విని,
ఎందుకు నేను వినబడుతున్నాను..
వాన వస్తుందే..
కానీ నేను అక్కడ లేను,
నేను ఆలోచనల మోసంలో
తొలి బిందువు నుండి చివరి సవ్వడి
వరకు
తేలుతూ వెళ్ళిపోతున్నాను..

– వెంకట్ మంత్రిప్రగడ

సింగిల్ పేజీ కథ

# భిన్నత్వంలో ఏకత్వం

మిలిటరీ క్వార్టర్స్ ఆవరణలో ఆ ఉదయం ఒక కొత్త కాంతి విరిసింది. మబ్బుల పొర వెనుక సూర్యుడు తొంగి చూసే ప్రయత్నంలో ఉండగా, పూలు రాలే శబ్దం నిశ్శబ్దాన్ని పగలగొడుతూ వినిపించింది. గుమ్మం ముందర కేరళ అమ్మాయి చేచి వంగి పూక్కళం అమర్చుతోంది. తెల్లటి కాటన్ చీర ఆమె భుజాలపై జారిపోతూ, జుట్టులో కొబ్బరి నూనె పరిమళం వెదజల్లుతోంది. పసుపు, ఎరుపు, తెలుపు, నీలం.. రంగు రంగుల పువ్వులు ఆమె వేళ్లలో చేరి, నేల మీద చిత్రరువులా విరబూస్తున్నాయి. కిటికీ తెరిచి ఆ దృశ్యం చూసిన మమత ఆనందంతో చిరునవ్వు విరబూసింది. మమత తెలంగాణ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాంతానికి చెందిన ఆర్మీ జవాన్ భార్య. చురుకైన చూపులు, మృదువైన మనసు. ఆమె బయటికొచ్చి పలకరించింది. "చేచీ! పువ్వుల వలయం ఎంత అందంగా ఉంది. మా తెలంగాణలో బతుకమ్మ కూడా ఇలాగే పువ్వులే కదా!" చేచి ఆగి, మమతవైపు చూసింది. "అవును మమతా! పండుగలు వేరైనా మనసులు కలుస్తాయి. రా, నువ్వూ ఒక పువ్వు తెచ్చి ఉంచు. నేను ఇంతలో వంటల్లో పడతాను." అంతలో దూరం నుంచి మరో అడుగుల శబ్దం. నార్త్ రాష్ట్రానికి చెందిన దేవి బుట్టలో పువ్వులు పట్టుకొని వచ్చింది. "ఏమంటారు అమ్మాయిలు? పూక్కళం కంటే పెద్ద వృత్తం స్నేహమా కాదా!" అని నవ్వింది. ఆ ముగ్గురూ కలిసి కూర్చొని పువ్వులు అమర్చారు. ఆవరణలో పూల పరిమళం వ్యాపించగా, ఆ క్షణమే దేశ భిన్నత్వం ఒక్క వలయంగా కలిసిపోయింది. చేచి వంటింటిలోకి వెళ్లింది. జీలకర్ర వేగిన శబ్దం, కొబ్బరి తురిమిన తీపి వాసన, మిరియాల కారం కలిసి కొత్త సువాసన పంచాయి.

మమత వంటల గిన్నెల్లో తొంగిచూసింది.. "ఇన్ని రకాల వంటలు చేస్తావా?" చేచి చిరునవ్వుతో "సద్య అనేది కేవలం భోజనం కాదు మమతా. అరటి ఆకుపై వడ్డించే విందు. వందల ఏళ్ల కేరళ సంప్రదాయం. ఇందులో పులుపు, కారం, తీపి, ఉప్పు అన్నీ కలిసి ఒక సమతుల్యం ఇస్తాయి. అదే జీవితం కదా!" అందరూ సహాయ సహకారాలతో వంటలో నిమగ్నమయ్యారు. దేవి ఆవరణలో పువ్వులు సర్దుతుంటే, మమత బుట్టలో కూరగాయలు సర్దింది. ప్రతి ఒక్కరి చేతిలో పనులు, హృదయంలో ఉత్సాహం. "చేచి, ఓనం వెనుక ఉన్న కథ చెప్పవా?" అని మమత ఆసక్తిగా అడిగింది. చేచి ఆగి మృదువైన స్వరంతో "బలిచక్రవర్తి పరిపాలనను స్వర్ణయుగమని పిలుస్తారు. సమానత్వం, శాంతి, సద్భావన ఆయన రాజ్యంలో సహజం. విష్ణువు ఆయనను వామనావతారం రూపంలో పరీక్షించినా, మహాబలి భూమి అంతా అర్పించాడు. కానీ సంవత్సరానికి ఒకసారి తన ప్రజలను దర్శించడానికి తిరిగి వస్తాడని విశ్వాసం. ఆ జ్ఞాపకమే ఓనం" అని వివరించింది.

మమత ఆలోచనలో మునిగిపోయి "నిజమే చేచీ! పండుగల సారాంశం సంప్రదాయాలను నిలబెట్టుకోవడమే. తెలంగాణలో బతుకమ్మకూ అదే మహత్తు ఉంది. గత సంవత్సరం ఇక్కడ బతుకమ్మ ఆడిన రోజులు ఇంకా కళ్లముందే ఉన్నాయి" అంది.

ఆ సమయానికి పిల్లలు ఆవరణలో కేరింతలతో మెలిగారు. టగ్ ఆఫ్ వార్ మొదలైంది. చిన్న చిన్న గళాలు ఆకాశాన్నంటాయి. "వద్దురా.. లాగు.. లాగు!" అని కేకలు. మధ్యలో ఒక ఆంటీ చిలిపిగా అడిగింది

"మీది కేరళ కదా?" మమత నవ్వుతూ "కాదు ఆంటీ, మాది తెలంగాణ! కానీ మా పిల్లలు, మా వంటలు ఈ రోజు కేరళ పండుగలో భాగస్వామ్యమే" అంది.

అందరికీ అరటి ఆకులు పంచబడ్డాయి. వంటగదిలో నుంచి వరుసగా వంటకాలు వచ్చాయి. పులిసేరి, అవియల్, తూరన్, కూటుకర్రీ, కిచడి.. ఇలా ప్రతి వంటకం వేర్వేరు రుచి, ప్రతి రుచి కొత్త అనుభూతి. చివరగా వడ్డించిన పాయసం విందు తియ్యని శిఖరానుభూతికి చేర్చింది. ఆ వాసనలో, ఆ రుచిలో ఒక మంత్రం ఉంది. అది కేరళ సంప్రదాయ వంటకాలకే కాదు, భారతీయ అతిథి సత్కారానికి ప్రతీక. అందరూ భోజనంలో మునిగిపోయిన వేళ, స్నేహిత్ ముందుకొచ్చాడు. "వనక్కం, ఎల్లావర్కుమ్ నమస్కారం!" అని మలయాళంలో పలికాడు. అందరి కళ్లూ విస్తారంగా తెరుచుకున్నాయి. "ఈ బాబు కేరళోడేనా?" అని ఎవరో ఆశ్చర్యపోయారు. మమత గర్వంగా నవ్వుతూ అంది "లేదు, మా బాబు తెలంగాణోడు!" ఆ ఒక్క మాట విన్న వెంటనే గదంతా చప్పట్లతో మార్మోగింది.



పాయసం రుచి చూస్తూ ఉత్తర రాష్ట్రపు అమ్మాయిలు తమ తమ పండుగల జ్ఞాపకాలను పంచుకున్నారు. "మా దగ్గర దీపావళి రాత్రంతా వెలుగుల పండుగ" అని ఒకరు అన్నారు. "మా దగ్గర హోలీ రంగుల తుఫాను" అని మరొకరు నవ్వారు. అప్పుడే మమత మధురంగా "మా రాష్ట్ర పువ్వు తంగేడు. మీది రాలే పువ్వు. పోలికలు చూడండి మనమందరం వేర్వేరు ప్రదేశాల వారైనా, మన సంస్కృతి మూలం మాత్రం ఒక్కటే". ఆ మాటలు ఆవరణలో గాలి తాకిన చప్పుడు లాగా అందరి హృదయాల్లో మోగాయి. సూర్యుడు అస్తమిస్తున్న వేళ ఆకాశం నారింజ రంగులో మెరిసింది. ఆ రోజు మిలిటరీ క్వార్టర్స్‌లో జరుపుకున్న ఓనం, కేవలం కేరళ పండుగగానే కాక, భారతీయ సంస్కృతి వైవిధ్యానికి ప్రతీకగా నిలిచిపోయింది. అందరూ ఒకే స్వరంతో గళం కలిపారు భిన్నత్వంలో ఏకత్వమే మన బలం!

– డా. పెరుక రాజు



# ట్రాఫిక్ కానిస్టేబుల్

మనిషి మనసుకు నియమ నిబంధనలు నచ్చవు. తప్పనిసరిగా పాటించాల్సి వస్తే ఎప్పుడో ఒకప్పుడు అతిక్రమించాలనే చూస్తుంటుంది. మిగతా అంశాల కన్నా ట్రాఫిక్ రూల్స్ విషయంలో అది బాగా కనిపిస్తుంటుంది.

దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లోను ఇదే వరస. అక్కడ ట్రాఫిక్ కానిస్టేబుళ్లు కానరాని చోట వాహనదారులు ట్రాఫిక్ నియమాలనుససేమిరా పట్టించుకోరు. దాంతో ప్రమాదాలు పెరుగుతుంటాయి. ప్రమాదాలను నివారించడానికి టెక్నాలజీని ఉపయోగించి ఓ అద్భుతాన్ని చేశారా దేశం వారు.

ట్రాఫిక్ కానిస్టేబుళ్లు లేనిచోట వాళ్ల బదులు 'హోలోగ్రామ్'లను ఏర్పాటు చేశారు. దూరం నుంచి చూసేవారికి అక్కడ కానిస్టేబుల్ ఉన్నట్లుగా ఉంటుంది. అసలైన కానిస్టేబుల్ ఉన్నట్లుగా అనిపించడంతో ట్రాఫిక్ అతిక్రమణలు తగ్గి, ప్రమాదాలు కూడా తగ్గుముఖం పట్టాయట. ఈ ఛాయా కానిస్టేబుల్ హోలోగ్రామ్ అని తెలిసినా అక్కడి వారు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తున్నారు.

# స్మార్ట్‌ఫోన్‌తో సినిమా

స్మార్ట్‌ఫోన్‌తో ఫొటోలు, వీడియోలు తీయొచ్చు. ఈ విషయం అందరికీ తెలిసిందే. కెమెరాలు, లైట్లు, సెటప్‌లు లేకుండానే సినిమా లెవెల్ షాట్‌లు తీయొచ్చు అంటున్నారు. ఎలా అంటారా 1.33 ఎక్స్ అనామార్ఫిక్ లెన్స్ సాయంతో స్మార్ట్ ఫోన్‌తోనే సినిమా షాట్‌లు తీయొచ్చు. ఈ లెన్స్ రెండు రకాల లైటింగ్ ఎఫెక్ట్స్‌తో పని చేస్తాయి. అందులో బ్లూ ఫ్లేర్ పెడితే ఇంట్లోనే స్పేస్ సినిమా ఫీల్ ఉంటుంది. గోల్డ్ ఫ్లేర్ పెడితే గుడిలో వచ్చే డివోషనల్ ఫీల్ కనిపిస్తుంది. దీంతో తీసిన వీడియో చూస్తే ఇది నిజంగా ఫోన్‌తో తీయగలరా? అని ఆశ్చర్యపోతారు. ఒక్కసారి వాడాక మామూలు కెమెరా



తెరవాలని కూడా అనిపించదు. ఇందులో మరో ప్రత్యేకత వీడియో సౌండ్ కూడా అద్భుతంగా రికార్డ్ అవుతుంది.



# కారును షాండ్లియర్‌లా..!

సంపన్నుల నగరం దుబాయ్. అక్కడ ఉన్నవారు చాలా వరకు కోటీశ్వరులే. ఇక కార్ల విషయానికొస్తే పిల్లలకు ఆట వస్తువులు కొన్నంత సులభంగా కార్లు కొంటుంటారు. అందులోనూ కస్టమైజ్డ్ రోల్స్‌రాయిస్ కార్లను ఎక్కువ మంది కొంటారు.

అక్కడి ఓ వ్యాపారవేత్త కొత్త జెట్ కారు ఒకటి కొన్నాడు. జెట్ కారు అంటే రోడ్డు పైన కాకుండా నీళ్ల పైన దూసుకెళ్లే కారు లాంటి బోట్. దీని ధర 5 లక్షల డాలర్లు. అంటే 4.3 కోట్లు. దానికి కొంత ఖర్చుపెట్టి ఫెరారీ రేస్ కారులా మార్పించాడు. అలా చేయించిన కారుని ఇంట్లో హాలు మధ్యలో షాండ్లియర్ మాదిరిగా వేలాడదీశాడు. దాని హెడ్‌లైట్లు, లోపలి లైట్లను రంగు రంగుల బల్బులతో ఏర్పాటు చేయించాడు. మహ్మద్ బైరాగ్దారి అనే ఆ ఇంటి యజమాని వేలాడదీసిన కారు వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేశాడు.

# పక్షుల భావ వ్యక్తీకరణ-దేశాల సంస్కృతి ప్రతిబింబం

**రెక్కల రాగాల గీతం.. ఆకాశ నీలిమ వెలిసిన వేళ పక్షుల కిలకిలలతో ఉదయం మేల్కొంటుంది. వర్షపు చినుకుల రాగంలో నెమలి నర్తనం, పర్వత శిఖరాలపై గద్ద ధైర్య విహారం. గాలి తాకిడిలో హంస నిశ్శబ్ద గానం, అడవి లోతుల్లో రంగురంగుల పక్షుల సందేశం.**



సముద్ర తీరాన పక్షుల నవ్వు మధురం, నదీతీరాన పక్షుల నిశ్శబ్ద తపస్సు. ప్రతి రెక్కల విప్పు ఒక కొత్త అర్థం. ప్రతి గానం ఒక కొత్త లోకం. మనిషి మాటలతో, చిత్రాలతో తన భావాలను చెప్పుకుంటాడు. కాని పక్షులు తమ స్వరాలతో, శరీర చలనాలతో, రెక్కల అల్లికలతో తమ మనసు మాటలు వెలిబుచ్చుకుంటాయి. అవి కేవలం సహజ ధ్వనులే కాదు; ఒక జీవన తత్త్వాన్ని, ఒక సంస్కృతిని, ఒక భావప్రపంచాన్ని అందిస్తాయి. ప్రతి దేశం తన భౌగోళిక స్వభావానికి, వాతావరణానికి తగ్గట్టుగానే ప్రత్యేకమైన పక్షులను కాపాడుకుంటూ, వాటిని ఒక జాతి గుర్తింపుగా భావిస్తుంది. ఇప్పుడు అలాంటి పది దేశాలు, వాటి ప్రత్యేక పక్షులు, వాటి భావవ్యక్తీకరణ విధానాలను పరిశీలిద్దాం.

## భారత్-నెమలి

భారతదేశపు జాతీయపక్షి నెమలి తన భావాలను రెక్కలు విప్పి వర్షాన్ని ఆహ్వానిస్తూ వ్యక్తపరుస్తుంది. వర్షపు చినుకులు పడుతుంటే, తన నీలి పచ్చని మెరుస్తున్న రెక్కలతో చేసే నృత్యం ఆనందాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది కేవలం ప్రకృతి ఉత్సవం మాత్రమే కాదు; ఆహ్లాదం, పంటల పట్ల ఆశ, జీవనోత్సాహానికి ప్రతీక.

## జపాన్-క్రేన్ పక్షి

జపాన్‌లో క్రేన్ పక్షిని శాంతి ప్రతీకగా పరిగణిస్తారు. రెండు క్రేన్‌లు ఒకేసారి ఎగిరే క్షణం అక్కడి ప్రజలకు దాంపత్య సౌఖ్యం గుర్తు చేస్తుంది. ఈ పక్షితన పొడవైన మెడను వంచి చేసే కీర్తన గాత్రం జపనీయులకి నిశ్శబ్దాన్ని మేలుకొలిపే సంగీతంలా అనిపిస్తుంది.

## ఆస్ట్రేలియా-కూకాబుర్రా

ఆస్ట్రేలియా అరణ్యాల్లో వినిపించే కూకాబుర్రా పక్షినవ్వు లాంటి అరుపు అక్కడి ప్రకృతికి ఒక ప్రత్యేక శబ్దం. ఇది తన పరిధిని ప్రకటించుకోవడమే



కాకుండా, గుంపులో ఆనందాన్ని పంచుతుంది. ఆ నవ్వు అక్కడి పిల్లలకు సంతోషానికి ప్రతీక.

## బ్రెజిల్-మకావ్

అమెజాన్ అడవుల్లో రంగుల వర్ణంలా మెరిసే మకావ్ పక్షి తన తోటి పక్షితో చేసే సంభాషణలో గట్టిగా అరుస్తుంది. అది ప్రేమను, ఆప్యాయతను వ్యక్తపరచటానికి తన రంగులే భాషగా మారతాయి. బ్రెజిల్ ప్రజలు మకావ్‌ను ఉత్సాహం,



ఉల్లాసానికి ప్రతీకగా చూస్తారు.

## దక్షిణాఫ్రికా- ఆఫ్రికన్ గ్రే పారట్

ఈ పక్షి మనుషుల మాటలను అనుకరిస్తూ, తన భావాలను మనుషులకే అర్థమయ్యేలా వ్యక్తం చేస్తుంది. అక్కడి సంస్కృతిలో ఇది జ్ఞానానికి, సహజ తెలివికి చిహ్నం. దాని మాటలే భావప్రకటనకు వంతెనగా నిలుస్తాయి.

## రష్యా-స్వాన్

రష్యా సరస్సులలో ఈదే తెల్లని స్వాన్ పక్షి తన జతతో చేసే ప్రయాణం నిబద్ధతకు ప్రతీక. దాని మృదువైన గీతలు సౌందర్యం, నిశ్శబ్దం, ప్రేమను ప్రతిబింబిస్తాయి.



రష్యన్ సాహిత్యంలో స్వాన్ తరచుగా త్యాగానికి, పవిత్రతకు రూపకంగా నిలుస్తుంది.

## అమెరికా - బాల్డ్ ఈగిల్

అమెరికా జాతీయపక్షి బాల్డ్ ఈగిల్ గగనంలో ఎత్తుగా ఎగిరి తన స్వేచ్ఛను వ్యక్తపరుస్తుంది. అది తన గర్జనతో తన పరిధిని తెలియజేస్తుంది. ప్రజాస్వామ్య భావాలను, స్వాతంత్ర్య తత్వాన్ని ఇది సూచిస్తుంది.

## ఈజిప్ట్-ఐబిస్

నైలు నదీ తీరంలో కనబడే ఐబిస్ పక్షి తన పొడవాటి ముక్కుతో నీటిలో ఆహారం వెతుకుతూ చేసే చలనాలు ఒక తపస్సులా కనిపిస్తాయి. ఈజిప్ట సంస్కృతిలో ఇది జ్ఞానం, దేవుని అనుగ్రహానికి ప్రతీక.

## చిలీ-ఆండియన్ కొండోర్

ఆండిస్ పర్వత శిఖరాలపై విహరించే కొండోర్ పక్షి తన విశాలమైన రెక్కలతో గాలి ప్రవాహాన్ని అధిగమిస్తూ ఎగురుతుంది. అది దృఢత, ఆత్మవిశ్వాసానికి చిహ్నం. తన ఎత్తైన విహారం ద్వారా అది సాహసాన్ని వ్యక్తపరుస్తుంది.

## ఇండోనేషియా-బర్డ్ ఆఫ్ ప్యారడైజ్

ఇండోనేషియా అరణ్యాల్లో కనిపించే ఈ పక్షి తన రంగుల నృత్యంతో జంటను ఆకర్షిస్తుంది. అది చేసే కదలికలు కళల ప్రదర్శనలా ఉంటాయి. ఇక్కడి ప్రజలకు ఇది శృంగార సౌందర్యానికి ప్రతీక. ప్రతి దేశంలో పక్షులు కేవలం జీవులు కాదు; అవి సంస్కృతికి ప్రతిబింబాలు. రెక్కల నృత్యం, స్వరాల గానం, రంగుల ఆడంబరం, గగన విహారం.. ఇవన్నీ భావ వ్యక్తీకరణకు మార్గాలు. ఒక జాతి చరిత్రను, ఒక దేశపు ఆత్మను పక్షుల ద్వారానే అర్థం చేసుకోవచ్చు. అవి మనిషికి స్ఫూర్తి, ప్రకృతికి రాగం, భూమికి జీవనోత్సాహం.

## పక్షుల మనోభావాల లోతులు- ఒక అంతిమ ఆవిష్కరణ

పక్షుల గురించి మనం ఏ దేశాన్నీ, ఏ జాతినీ ప్రత్యేకంగా చూశామో అది ఒక కోణం మాత్రమే. కానీ పక్షుల అంతరంగం మనిషి ఊహలకు మించి ఉన్న ఒక విశ్వాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి శబ్దం, ప్రతి రెక్కల విప్పు, ప్రతి ఆకాశ విహారం ఒక రహస్యమయమైన సందేశం. అవి మాటలు లేకుండా కూడా అనేక భావాలను, అనుభూతులను మనకు చేరవేస్తాయి.

మనిషి తన భాషలను సృష్టించి, లిపులను రాసుకొని, కళలతో తన హృదయాన్ని వ్యక్తం చేశాడు. కాని పక్షులు తమ సహజ స్వరాల ద్వారానే ఒక బలమైన ప్రపంచాన్ని నిర్మించాయి. ఉదయాన్నే వినిపించే వాటి గానాలు కొత్త ఆరంభాన్ని సూచిస్తాయి. సాయంత్రపు కిలకిలలు విశ్రాంతిని పిలుస్తాయి. ఎగిరే తీరు, గుంపులుగా కదలికలు.. ఇవన్నీ సమన్వయానికి ప్రతీకలు.

అంతేకాకుండా, పక్షులు ప్రతి ఖండంలో వాతావరణం, జీవన విధానానికి తగ్గట్టుగా ప్రత్యేకమైన ప్రవర్తనను అలవర్చుకున్నాయి. ఎడారి ప్రాంతాల్లో నివసించే పక్షులు ఓర్పుతో నీటి కోసం చేసే ప్రయత్నం ఒక సహన గాథ. మంచుతో కప్పబడి ఉండే ప్రాంతాల్లో గుంపులుగా కదిలే పక్షులు కలిసికట్టుగా బతికే పాఠాన్ని మనకు అందిస్తాయి. వర్షారణ్యాల్లో రంగుల పక్షులు ప్రకృతి వైవిధ్యాన్ని గీతగా పాడుతాయి.

ఈ భూమి పక్షుల గానం లేకుండా ఒక శూన్యమైన లోకంలా మారుతుంది. ఎందుకంటే అవి కేవలం ప్రకృతిని అలంకరించడమే కాదు, మనిషి మనసును కూడా మేల్కొలుపుతాయి. ఒక చిన్న గువ్వ తన గూటి కోసం కష్టపడుతూ చూపే పట్టుదల జీవన తత్వాన్ని నేర్పుతుంది. ఒక తిత్తిబల్లి స్వరాల్లో వినిపించే ఆటపాటలు బాల్య నిర్దోషిత్వాన్ని గుర్తు చేస్తాయి. గగనంలో ఎత్తుకు ఎగిరే పక్షులు స్వేచ్ఛ పట్ల మమకారాన్ని మేల్కొలుపుతాయి.



ఇలా పక్షుల భావవ్యక్తీకరణ కేవలం శబ్దాలకే పరిమితం కాదు; అది ఒక సంస్కృతికీ, ఒక ఆత్మస్వరూపానికీ ప్రతిబింబం. వాటి గీతల్లో మనిషి భవిష్యత్తుకి ఆశ ఉంది. వాటి విహారంలో సమతా సూత్రం దాగి ఉంది. వాటి రంగుల్లో సృజనాత్మకతకు నూతన ప్రేరణ ఉంది. అందుకే పక్షులను కేవలం చూడటమే కాకుండా, వాటి గీతాలను మనసుతో వినాలి. వాటి చలనాలను అర్థం చేసుకోవాలి. అప్పుడు మాత్రమే మనిషి తన అంతరంగాన్ని విస్తృతంగా తెలుసుకోగలడు. ఈ భూమిపై పక్షులు ఉంటేనే మనిషి జీవితం సంపూర్ణమవుతుంది. వాటి గానం మనకు స్ఫూర్తి, వాటి రెక్కలు మనకు ఆశ, వాటి జీవనశైలి మనకు సత్య పాఠశాల.

**- డా. చిటికెన కిరణ్ కుమార్**

# తన కోపమే తన శత్రువు

కథ

అనగనగా ఒక అడవి, ఆ అడవికి మహారాజు సింహం, అనేక జంతువులు అక్కడ నివసిస్తున్నాయి, అక్కడ మంత్రి అయిన ఎలుగుబంటితో రాజు "ఇక్కడ ఉన్న జంతువులన్నీ ప్రతిరోజూ ఆహారాన్ని తెచ్చి రాజైన నాకు ఇవ్వాలి" అని చెప్పింది.

"ఓ! అలాగే ప్రభూ!" అని అక్కడ ఉన్న జంతువులన్నింటికీ ఆ విషయం తెలియపరుస్తుంది మంత్రి



"అసలే ఈ సింహానికి చాలా కోపం ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకుని వెళ్లి ఇవ్వకపోతే మనమే దానికి ఆహారం అయిపోతాం" అని ఆలోచించి అడవుల్లో జంతువులన్నీ రోజు తిండిని అందిస్తున్నాయి రాజుగారికి.

ఒక్క కొంటె నక్క మాత్రం "నాకు నలుగురు పిల్లలు ఉన్నారు. అందుకే తిండి చాలటం లేదు అని కొంచెం ఆహారం మాత్రమే మీకు ఇస్తున్నాను" అని ప్రతి రోజు సాకు చెప్పి తప్పించుకుంటోంది.

"ఆహా! రోజు ఇవే మాటలు విని విని ఒక రోజు చాలా కోపంతో సింహం నా దగ్గరా? నీ గడసరితనం" అని నక్క మీదకి హఠాత్తుగా పంజా విసిరి దాన్ని చంపి తినేసింది.

అడవిలో జంతువులన్నీ ఒక్కసారిగా హడలిపోయాయి, పాపం! అక్కడ ఉన్న నక్కపిల్లలు ఏమీ తెలియక సింహం దగ్గరే ఉండి దాని మీదకి ఎక్కడం, సింహం తోకలాగడం చేసి ఆడుకుంటున్నాయి. అసలే కోపంతో ఉన్న రాజు ఆ పిల్లలన్నింటినీ తినేద్దాం అనుకున్న సమయానికి మహామంత్రి అయిన ఎలుగుబంటి వచ్చి ఆపింది. "మహారాజా! నక్క పిల్లలు చాలా చిన్నవి, వాటికి తల్లి లేదని తెలియదు, వాటికి మీరే తల్లి అనుకుని మీతో ఆడుకుంటున్నాయి. ఒక్కసారి ఆ పిల్లల వైపు నుండి ఊడా ఆలోచించి, అప్పుడు చంపండి" అంది.

"అయ్యో! మహామంత్రీ! నాకు అంతటి ఆలోచన రాలేదు. నా కోపమే నాకు శత్రువు అయింది" సింహం బాధపడి ఇప్పటి నుండి ఆ నక్క పిల్లలని నేను తల్లిగా చూసుకుంటాను" అని ఆ పిల్లలన్నింటికీ ఆహారం తినిపించింది. అది చూసి అడవిలో జంతువులన్నీ మంత్రితో సహా మాకు మంచి రాజుగారు దొరికారని ఆనందంగా మహారాజుకి జేజేలు పలికారు.

**- బల్ల కృష్ణవేణి,** పలాస

## వార్త ఆదివారం

# బాలగేయం

## పిల్లలం

మేం పిల్లలం..
మేం పిల్లలం
నేలతల్లి పసిడి పువ్వులం!
భరతమాత ముద్దుబిడ్డలం
భావిభారత భాగ్యరేఖలం!
సన్నజాజి చెట్టురెమ్మలం!
పచ్చని లోగిలికి వన్నెలం
చల్లని నీడనిచ్చే కొమ్మలం!
పాఠశాలలో ఆడిపాడే ఆటలం!

పలకపై ఓనమాలు దిద్దే
బాలలం
మేము దేశానికి రేపటి
పౌరులం!

భద్రతను ఇచ్చే సైనికులం!
ఆరోగ్యాన్ని కాపాడే డాక్టర్లం
సౌధాలను నిర్మించే
ఇంజనీర్లం!

అలుపెరుగని శ్రమ
యోధులం!
పంటలను పండించే కర్షకులం
చెమటలను రాల్చే శ్రామికులం!

డా॥ పగిడిపల్లి సురేందరు

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

ఇ.సాయికుమార్,
పాల్వంచ

ప్రశ్న: తుమ్మడం అశుభమా?

**జవాబు:** తుమ్మడం అశుభం అనేవారికి శ్వాస పీల్చడమే అశుభం. మన దేశంలో కాదు.. వివిధ దేశాలలో ఈ మూఢనమ్మకం ఉంది. తుమ్ము రాని మనుషులంటూ ఎవరూ వుండరు. తుమ్మడం అన్నది శరీర ధర్మాల్లో ఒకటి. ముక్కులోని మ్యూకస్ తుమ్మును ప్రేరేపిస్తుంది. మ్యూకస్‌కు ఏ విధమైన దురద కలిగినా, కొన్ని వెగటు వాసనలు, ఘాటైన పదార్థాల వాసనలు వచ్చినా మ్యూకస్ ప్రభావితమై తుమ్మడం జరుగుతుంది. జలుబు వల్ల, ఎలర్జీ వల్ల కూడా తుమ్ములు వస్తాయి. తుమ్మడమన్నది శరీర సహజక్రియేగానీ, దానివల్ల అశుభమన్నది ఉండదు. ముక్కులో ఏమైనా దుమ్ము ధూళి వున్నా, మలినాలు ఉన్నా తుమ్ముతో పాటు వెలుపలికి వచ్చి ముక్కు శుభ్రపడుతుంది. తుమ్ము, తుమ్మడం మీద అన్ని దేశాలలో కంటే మన దేశంలోనే వివిధ ఆచారాలు, మూఢ విశ్వాసాలూ అనేకం వున్నాయి. తుమ్ముకు అదృష్ట, దురదృష్టాలనూ ముడి వేసారు. శుభాశుభాలనూ లంకె వేసారు. మరో విషయం.. తుమ్ము వస్తున్నప్పుడు బలవంతంగా ఆపుకోకూడదు.

ఎస్.మాధవన్, కావలి

ప్రశ్న: క్యారెట్ కొలమానం ఏమిటి?

**జవాబు:** ఒక క్యారెట్ వజ్రం అంటే గ్రాములో అయిదవ వంతుతో సమానం. అంటే 200 మి.గ్రా. ఒక క్యారెట్ అవుతుంది. వజ్రం పరిమాణంతో పాటు దాని ధర కూడా పెరుగుతూ ఉంటుంది. డైమండ్స్‌ను సెంట్స్‌లో కొలమానం చేస్తారు. వంద సెంట్లు ఒక క్యారెట్‌తో సమానం.

# కృత్రిమ మేధ వరమా, శాపమా?

పూర్వ యుగం నుంచి నేటి డిజిటల్ ఏఐ యుగం వరకు మానవ పరిణామ క్రమంగా ఊహాకందని మార్పులు వచ్చాయి, వస్తున్నాయి. అంతర్జాల వలయంతో భూమి కుగ్రామం అయిపోయింది. శాస్త్ర సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్నది. అత్యాధునిక మానవుడు ఏఐ ఆటోమేషన్ టెక్నాలజీలను ఉపయోగించి అద్భుతాలు సృష్టిస్తునాడు. ఏఐఆటొమేషన్ టెక్నిక్‌లను ఉపయోగించని వ్యక్తి కనిపించడంతో లేదు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది కృత్రిమ మేధ లేదా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఐఏ) మార్కెట్ 54 శాతం వరకు పెరుగుతున్నట్లు పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. మన నిత్య జీవితంలో మనకు తెలియకుండానే ఏఐ మన జీవనశైలిలోకి దూరిపోయింది. రోబోలు,



స్వయంగా నడిచే కార్లు, వంటింటి ఉపకరణాలు, టివీ ఉపయోగాలు లాంటి ఏఐఆటొమేషన్ వనరులు మనకు పరిచయం అవుతున్నాయి. మానవ మేధను ఒక కంప్యూటర్ మెషిన్‌లో ప్రోగ్రామ్ చేసి మానవులు చేసే సర్వసాధారణ పనులను చేయగల యంత్రాలను ఏఐ రూపొందిస్తున్నది. ఏఐ ఆటొమేషన్ టెక్నాలజీలను వినియోగిస్తూ మానవులు చేసే పనులను అత్యంత తేలికగా, కచ్చితత్వం, స్పష్టతతో మిషిన్లు చేయడం నేటి నవ్య జీవన విధానంగా మారిపోతున్నది. ఆటోమొబైల్స్, గృహోపకరణాలు, భాషా తర్జుమాలు లాంటి అసంఖ్యాక రంగాల్లో నేడు ఏఐ ఆటొమేషన్ దూరిపోయి అద్భుత ఫలితాలను మానవాళికా బహుకరిస్తున్నది. నేటి అత్యాధునిక ఏఐ ఆటొమేషన్ సాంకేతికతకు పలు ప్రయోజనాలతో పాటు కొన్ని ప్రతికూలతలు లేదా అప్రయోజనాలు లేదా నష్టాలు కూడా ఉండడం గమనార్హం.

## ఏఐఆటొమేషన్ టెక్నాలజీల ప్రధాన ప్రయోజనాలు

**మానవ తప్పిదాలను తగ్గించడం:** కృత్రిమ మేధను ఉపయోగించి మానవ తప్పిదాలను తగ్గించడంతో పాటు అతి క్లిష్టమైన పనులను అత్యంత వేగంగా, సులభంగా, ఖచ్చితత్వం, సునిశితత్వంతో పొరపాట్లు లేకుండా చేయడం జరుగుతోంది. వైద్యరంగంలో నేడు రోబోటిక్ సర్జరీలు సర్వసాధారణం కావడం, రోగి సురక్షి తంగా బయట పడడం, శస్త్రచికిత్సలో వైద్యుల తప్పిదాలకు తావులేకుండా పోవడం జరుగుతున్నది.

**ప్రమాదరహిత టెక్నాలజీ(జీరో రిస్క్):** ప్రమాదకర పనులను చేయడానికి మానవులకు బదులు ఏఐ రోబోట్లను ఉపయోగించడంతో ప్రమాదరహితంగా అనుకున్న పనులు పూర్తి అవుతున్నాయి. బాంబులను డిఫ్యూజ్ చేయడం, ప్రమాదకర పనుల్లో రోబోలను వాడడంతో మానవులను జీరో రిస్క్‌తో పనులు పూర్తి అవుతున్నాయి.

**అన్ని వేళల్లో అందుబాటులోఉండడం:** ఒక పనిని చేయడానికి మనిషి ఏకాగ్రత 3 నుంచి 4 గంటలు మాత్రమే గరిష్టంగా ఉంటుంది. ఏఐ ఆటొమేషన్ ఉపకరణాలు మాత్రం 24/7 అంతే కచ్చితత్వంతో సంక్లిష్ట బహుముఖ పనులను సదా మనిషి కన్నా వేగంగా ఏక కాలంలో చేయగలుగుతాయి.

**నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం (డెసిజన్ మేకింగ్):** మనం అందించే అవసరమైన అధిక డాటాను అల్గారిథమ్ సహాయంతో విశ్లేషించి వేగంగా కచ్చితమైన నిర్ణయాలతో ఫలితాలను అందించడం ఏఐఆటొమేషన్ ప్రత్యేకమని తెలుసుకోవాలి. వైద్యులు కూడా అంచనా వేయలేని వ్యాధులను సహితం ఎక్స్‌రే, ఎంఆర్ఐల సహాయంతో ఏఐ టెక్నాలజీ ప్రయోగించి కేన్సర్ లాంటి రోగాలను కూడా నిర్ధారణ చేయగల టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది.

**డిజిటల్ సహాయం:** డిజిటల్ సహాయకులను నియమించుకొని కంపెనీలు తమ కస్టమర్ల అనుమానాలను నివృత్తి చేసుకోవడం, మానవ ప్రమేయాన్ని తగ్గించడం కొనసాగుతోంది.

**ఆటొమేషన్:** తమ సాధారణ పత్రాల్లో పొరపాట్లను గుర్తించడం, కృతజ్ఞతాపూర్వక మెయిల్స్ పంపడం, వెల్డింగ్, పేయింటింగ్, ప్యాకేజింగ్ లాంటి అంశాలను ఏఐ ఆటొమేషన్ ద్వారా చేయడంతో పాటు ఖర్చులను తగ్గించడం జరుగుతున్నది.

**నిష్పక్షపాత నిర్ణయాలు:** మానవులకే ప్రత్యేకమైన భావోద్వేగాలను ఏఐఆటొమేషన్ కలిగి ఉండకుండా నిష్పక్షపాతమైన విశ్లేషణలను సత్వరమే ఇవ్వగలగడం అతి ముఖ్యమైన అంశంగా భావించాలి. ఉద్యోగ నియామకాలకు వచ్చిన దరఖాస్తులను నిష్పక్షపాతంగా విశ్లేషించి నైపుణ్యాలు, విద్యార్హతలను బట్టి నిర్ణయాలు వెలువరించడం ఏఐఆటొమేషన్ ప్రత్యేకం.

**నూతన ఆవిష్కరణలు:** మానవులు ఎదుర్కొంటున్న సంక్లిష్ట సమస్యలకు పరిష్కారాలు ఇవ్వగల వినూత్న ఆవిష్కరణలు ఏఐఆటొమేషన్ వేదికగా జరుగుతున్నాయి.

**కార్యదక్షత, ఉత్పత్తి పెరుగుదల:** ఏఐఆటోమేషన్ వినియోగంతో పరిశ్రమల్లో తక్కువ సమయంలో ఎక్కువ కార్యదక్షత, ఉత్పత్తులను పెంచడం, డాటా విశ్లేషణతో ఫలితాలను అంచనా వేయడం, మెరుగు పరిచే సూచనలు చేయడం, వ్యాపారంలో లొసుగులను తగ్గించడం కొనసాగుతున్నది.

**ప్రమాద పరిస్థితుల్లో ఏఐ:** మానవ ప్రమేయ లేదా సహజ విపత్తులు జరిగినపుడు, గనుల్లో ప్రమాదాలు, బాంబులను నిర్వీర్యం చేయడం లాంటి ప్రమాదకర విధులను మానవుడి బదులు ఏఐఆటోమేషన్ ఉపకరణాలు సమర్థవంతంగా చేయడం చూస్తున్నాం.

**వైద్య రంగంలో విస్తృత ప్రయోజనాలు:** వైద్య ఆరోగ్య రంగాల్లో ఏఐఆటోమేషన్ ప్రయోజనకర ప్రమేయం తార స్థాయికి చేరింది. రోగ నిర్ధారణ, చికిత్స, ఔషధాల రూపకల్పన లాంటి రంగాల్లో ఏఐఆటోమేషన్ టెక్నాలజీ




బహువిధ ప్రయోజనాలను అందిస్తున్నది. మానవ దృష్టికి రాలేని రోగ నిర్ధారణలు ఏఐఆటోమేషన్‌లతో సుసాధ్యం అవుతున్నాయి.

ఏఐ ఆటోమేషన్ టెక్నాలజీలను ప్రయోగించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పనులను చేయడం ద్వారా జీతభత్యాలు, శిక్షణ ఖర్చులు, ఇతర ఆర్థిక ఖర్చులను తగ్గించి సంస్థను లాభాల బాటన నడపవచ్చు.

అందుబాటులో ఉన్న డాటాను విశ్లేషణ చేసి జరుగుతున్న మానవ క్రియలను సక్రమంగా, నిరాటకంగా చేయడానికి అవసరమైన సూచనలు చేయడం, మెరుగైన ఫలితాలకు బాటలు వేయడం, వనరుల సద్వినియోగం, కాలయాపన తగ్గించడం లాంటివి ఏఐ టెక్నాలజీల వల్ల కలుగుతాయి.

చేయవలసిన పనులను ప్రాధాన్యతా క్రమంలో ఉంచడం, మీటింగులను షెడ్యూల్ చేయడం, సాధారణ పనులకు క్రమబద్ధీకరించడం లాంటివి ఏఐఆటోమేషన్ వల్ల సుసాధ్యం అవుతాయి.

ఏఐఆటోమేషన్ టెక్నాలజీలతో వ్యక్తిగత అభిరుచులను గుర్తించి మన అవసరాలకు అనుగుణంగా తగు సూచనలు చేయడం జరుగుతుంది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ లాంటి ఓటిటి ప్లాట్‌ఫామ్స్‌లో మన అభిరుచులను బట్టి సినిమాలు/సీరియల్స్‌ను సిఫార్సు చేయడం జరుగుతుంది.

**సమస్యల పరిష్కారం:** ఏఐఆటోమేషన్ టెక్నాలజీ సహాయంతో వ్యాపార సంస్థల్లో వచ్చే పలు సంక్లిష్ట సమస్యలకు తగు పరిష్కారాలను సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా తేలికగా చూపగలుగుతుంది.

## ప్రతికూలతలు/నష్టాలు

ఏఐఆటోమేషన్ సాంకేతికతలకు ప్రయోజనాలు అనేకం ఉన్నప్పటికీ దాని ప్రయోగంతో కొన్ని ప్రమాదకర ప్రతికూలతలు, నష్టాలు కూడా కలుగుతుండడం విచారకరం. ఏఐఆటోమేషన్ టెక్నాలజీలో సృజనశీల ఆలోచనలు, భావోద్వేగ లక్షణాలు, సహానుభూతి సంగతులు, పరిస్థితులను బట్టి ఆలోచనలు లాంటి అంశాలకు తావుండదు.

**ఉద్యోగుల తగ్గింపు:** ఏఐఆటోమేషన్ టెక్నాలజీ ద్వారా సర్వసాధారణంగా అధిక సంఖ్యలో ఉద్యోగులు చేయవలసిన పనులను చాలా సులభంగా, కచ్చితత్వం, సునిశితత్వంతో ఈ సాంకేతికత చేయగలగడంతో సంస్థల్లో ఉద్యోగాలకు కోత పడడం వల్ల నిరుద్యోగం, సామాజిక అశాంతి, పేదరికం పెరగడం జరుగుతుంది.

మనం అందించిన పూర్తి డాటాను వినియోగించి విశ్లేషించగల ఏఐఆటోమేషన్ టెక్నాలజీ వల్ల మన అనుమతి లేకుండానే వ్యక్తిగత సమాచారం బహిర్గతం కావడం కూడా జరిగే ప్రమాదాలు కనిపిస్తుండడం విచారకరం. అతిగా ఏఐఆటోమేషన్ టెక్నాలజీపై ఆధారపడడం, ప్రతి చిన్న పనికి దీనిని వినియోగించడం, తనలో ఆలోచనగా సామర్థ్యాల నైపుణ్యాలు/విజ్ఞాన వివేకాలు తగ్గడం వల్ల మనిషి సోమరిగా మారే అవకాశాలు పెరుగుతున్నాయి.

పౌర సమాజం అతిగా ఏఐఆటోమేషన్ టెక్నాలజీపై ఆధారపడడంతో మానవ మెదడుకు పని లేకుండా పోవడం, నిర్ణయాలు తీసుకోలేకపోవడం, సమస్యల పరిష్కారాల సామర్థ్యాలు తగ్గడం జరగవచ్చు.

మనం అందించే డాటా ఆధారంగా మాత్రమే పని చేయగల ఏఐఆటోమేషన్ టెక్నాలజీ వల్ల మానవ మేధోశక్తికి ధీటుగా పని చేయడంలో విఫలం అవుతున్నది.

**విశ్లేషణలు, పారదర్శకత:** ఏఐఆటోమేషన్ టెక్నాలజీకి డాటాను విశ్లేషించే శక్తి మాత్రమే ఉండడంతో దానిలో జవాబుదారీతనం కనిపించదు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో పారదర్శకత కూడా సన్నగిల్లడం కనిపిస్తుంది. వంటింటి నుంచి అంతరిక్ష ప్రయోగాల వరకు విస్తరిస్తున్న, విస్తరించా తన స్థానాన్ని సుస్థిర పరుచుకున్న ఏఐఆటోమేషన్ టెక్నాలజీ మానవాళికి వరంగా మాత్రమే మారాలని, అది శాపంగా మారితే తీవ్రమైన ప్రతికూల ప్రభావాలతో పౌర సమాజాన్ని అతలాకుతలం చేయగలదని గమనించి దానిని సద్వినియోగం చేసుకుందాం, దానిని అనైతిక, మోసపూరిత, స్వప్రయోజనాల కోసం వినియోగించడానికి ప్రయత్నించే వ్యక్తులను సత్వరమే గుర్తించి సంకెళ్లు వేయాలని ఆశిద్దాం, ఏఐఆటోమేషన్ టెక్నాలజీని ఒక అపురూప ప్రసాదంగా వినియోగించుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

కథ

# హృదయ స్పందన

గిరి పట్ల

సోఫాలో అలా కూర్చునేలోపే తన పైజామా జేబులో ఉన్న మొబైల్ ఫోన్ రింగ్ అయింది. చేతిలోకి తీసుకుని లిఫ్ట్ చేసి, "హలో.." అంటూ కూర్చున్నాడు సోమసుందరం

"హలో.. నాన్నా రీచ్ అయ్యారా?" అని అడిగాడు కొడుకు మోహన్.

ఇదిగోరా.. ఇప్పుడే ఇలా వచ్చి కూర్చున్నానో లేదో నీ ఫోన్...నువ్వెళ్లావా ఆఫీస్‌కు? అడుగుతూ ఒరిగాడు సోఫాలో.

దారిలో ఉన్నా నాన్నా ఏమైనా అవసరం అయితే ఫోన్ చేయండి నేను ఆఫీస్ అయ్యాకా మళ్లీ కాల్ చేస్తాను.. అని ఫోన్ కట్ చేసి కారుని ముందుకు పోనిచ్చాడు...కారు గచ్చిబౌలి పై ఓవర్ బ్రిడ్జ్ ఎక్కింది. మోహన్ గచ్చిబౌలి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో వర్క్ చేస్తున్నాడు..

సోమసుందరం సొంత ఊరిలోనే ప్రభుత్వ పాఠశాలలో పని చేసిన విశ్రాంత ఉపాధ్యాయులు తన భార్య భూదేవితో కలిసి ఊరిలోనే జీవనం గడుపుతున్నారు. కొడుకు కూతురు ఇద్దరూ వాళ్ల కుటుంబాలతో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

ఓ నాలుగు రోజులు ఉండిపోవడానికి పిల్లల్ని ఊరికి రమ్మని ఎంత పిలిచినా గానీ పనుల ఒత్తిడి వల్ల రాలేకపోతున్నాం.. మీరే రండి.." అని పిలిచేవారు. చేసేది లేక దంపతులే ప్రయాణాలు పెట్టుకునేవారు.

ఒక వారం కొడుకు దగ్గర ఉండి కూతురు ప్రమద ఇంటికి వచ్చారు..

"కారులో మిమ్మల్ని చెల్లి ఇంటిదగ్గర దిగబెడతా నాన్న" అని అంటే వద్దులేరా నీకు ఆఫీస్‌కు టైమ్ అయిపోతోంది నువ్వెళ్ళు, మాకు క్యాబ్ బుక్ చేయి చాలు.. మేం వెళ్తామని" వచ్చారు.

మోహన్ ఆఫీసుకు దగ్గరికి రాగానే "అన్నయ్యా, అన్నయ్యా.. నాన్న గుండెల్లో నొప్పంటూ కుప్పకూలిపోయాడు. మేం హాస్పిటల్‌కు వెళ్తున్నాం నువ్ త్వరగా రారా అన్నయ్య" అని బోరున విలపిస్తూ చెల్లి ఫోన్ చేసింది.

ఒక్కసారిగా గుండె జారిపోయిన మోహన్ "ఎప్పుడూ? ఎప్పుడమ్మా? ఇప్పుడే కదా నాన్నతో మాట్లాడాను" అని అడుగుతుండగా–

నువ్వు త్వరగా రా అన్నయ్య.. నాన్నలో చలనం లేదు భయంగా ఉందని బోరున ఏడుస్తూ చెప్పింది.. క్షణంలో కారు టర్న్ తీసుకుంది. "దేవుడా! నాన్నకు ఏమీ జరగొద్దు.." అని వేడుకుంటూ కారు స్పీడ్ పెంచాడు....

................

హాస్పిటల్‌లో డాక్టర్ రామచంద్ర రూంలో తన బావతో కలిసి మోహన్ కూర్చుని ఉన్నారు...

డాక్టర్ రిపోర్ట్స్ తిరగేస్తూ ... "మిస్టర్ మోహన్, మీ నాన్న గారి గుండెలోని కరోనరీ ధమనులలో ఒకదానిలో రక్త ప్రసరణ పూర్తిగా తగ్గిపోయింది. దానివల్ల గుండెల్లో నొప్పి వచ్చింది. సకాలంలో హాస్పిటల్‌కు తీసుకురావడం వల్ల ఆయనకు చాలా మంచి జరిగింది.



వెంటనే ఆపరేషన్ చేయాలి. ఇలాంటి ఆపరేషన్స్ స్పెషలిస్ట్ ఇండియాలోని టాప్ టెన్ డాక్టర్స్‌లో ఒకరైన డాక్టర్ కృష్ణ కుమార్‌గారి అపాయింట్మెంట్ ఉంది. సో, మీరు మనీ ఏర్పాటు ఎంత తొందరగా చేసుకుంటే అంత బెటర్" అని చెప్పాడు.

"సరే.." అని తల ఊపి బయటికి వచ్చాడు మోహన్.

ఏనాడూ తలనొప్పి కూడా ఎరగని నాన్నకు సడెన్‌గా గుండెపోటు రావడం ఏంటని? అనుకుంటూ కుటుంబ సభ్యుల దగ్గరికి వచ్చాడు. అందరి ముఖాల్లో ఆందోళన భయం కనిపిస్తుంది.

మోహన్ మనసు కీడు శంకిస్తోంది..

తల్లిని చూశాడు.. బోరుమంటోంది దగ్గరకి వచ్చి "అమ్మా... భయమేమీ లేదు. ఆపరేషన్ చేస్తే సరిపోతుందన్నారుచ అధైర్యపడకు" అని భయంగానే చెప్పి అమ్మను దగ్గరికి తీసుకో అని చెల్లికి చెప్పాడు.

ప్రమద తల్లిని దగ్గరికి తీసుకుని ఓదారుస్తోంది.

...............

తరువాతి రోజు డాక్టర్ కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో ఆపరేషన్ విజయవంతంగా జరిగింది.

దేవుడి దయవల్ల అంతా మంచే జరిగిందని అందరూ ఎంతగానో సంతోషించారు.

నాలుగు రోజులు గడిచిన తరువాత ఒకరోజు పొద్దున "అమ్మా... రేపు మనం ఇంటికి వెళ్ళిపోవచ్చని చెప్తున్నారమ్మా డాక్టర్స్" అని తల్లికి చెప్తున్న కొడుకు మాటలు సుందరం చెవిన పడ్డాయి.

"ఏంటి? రేపు వెళ్ళిపోతామా మనం?"

"ఒరేయ్ మోహన్, నాకు ఆపరేషన్ చేసి బతికించిన డాక్టర్ గారితో నేను ఒకసారి కలిసి మాట్లాడాలిరా, కుదురుతుందా?" అని అడిగాడు..

"ఎందుకు నాన్న? ఏం మాట్లాడాలి? మెడిసిన్స్ ఎలా వాడాలి ఎలాంటి కేర్ తీసుకోవాలి అవన్నీ మేము తెలుసుకున్నాంలే" అన్నాడు.

"తనకు కృతజ్ఞతలు చెప్పుకోవాలని నా మనసు ఆరాట పడుతోందిరా!" అని చెప్పాడు

"నాన్నా, ఆయన బిజీగా ఉంటారు. కుదురుతుందో లేదో!" అని చెప్పగానే తల్లి కల్పించుకొని...

"పోనీలేరా.. అంతగా అడుగుతున్నారుగా! ఒకసారి కనుక్కో" అంది.

"సరేనమ్మా!" అని వెళ్ళి కాసేపటికి డాక్టర్‌ని వెంట బెట్టుకుని వచ్చాడు. "నాన్నా, మీకు ఆపరేషన్ చేసింది ఈ డాక్టర్ గారే" అని చూపించాడు..

సుందరం బెడ్‌పై నుండి లేవబోయాడు..

అది చూసి డాక్టర్ "మాస్టారు, మీరు లేవకండి, రిలాక్స్ అవ్వండి నాతో ఏదో మాట్లాడాలని అన్నారటా? అని" ప్రేమగా అడుగుతూ ఆ పక్కనే ఉన్న కుర్చీని లాక్కొని దగ్గరగా కూర్చున్నాడు.

"డాక్టర్ బాబు నా ప్రాణాలు కాపాడమని ఆ భగవంతుడే నిన్ను నాకోసం పంపించాడు.." అని చేతులెత్తి మొక్కాడు.

"ఎందుకు సార్! నాకు దండాలు పెడతారు? అంత గొప్ప పని నేనేం చేశానని? నా వృత్తి నేను నిర్వర్తించాను అంతే" అని దండం పెట్టిన ఆయన చేతులను పట్టుకున్నాడు డాక్టర్. "లేదు బాబు.. వైద్యో నారాయణ హరి అన్నారు. పెద్దలు ప్రాణాలు నిలబెట్టే ప్రతి వైద్యుడు దేవుడే మీకు మొక్కితే తప్పేంలేదు.." అన్నాడు.

"అంత పెద్ద మాటలు వద్దు.. మాస్టారు" అని చెప్పి చేతులు వెనక్కి పెట్టాడు.

**"నాన్నా, ఆయన బిజీగా ఉంటారు. కుదురుతుందో లేదో!" అని చెప్పగానే తల్లి కల్పించుకొని...**

**"పోనీలేరా.. అంతగా అడుగుతున్నారుగా! ఒకసారి కనుక్కో" అంది.**

ఇంతలో నర్స్ వచ్చి "మోహన్ గారు మీరు ఒకసారి బిల్లింగ్ సెక్షన్‌కు రండి" అని పిలిచింది.

ప్రమద "బావా, మీరు రండి, అమ్మా నువ్విక్కడే ఉండు" అని చెప్పి చెల్లి బావతో కలిసి బయటికి నడిచాడు మోహన్.

"ఎవరి వృత్తిని వారు దైవంగా భావించి విధిని నిస్వార్థంగా నిర్వహించే ప్రతి మనిషి దేశానికి సేవ చేసినట్టినన్న గొప్ప సూత్రం నాకు మీరు చెప్పిందే" మాస్టారు అని అన్నాడు కృష్ణకుమార్.

ఆ మాటకు ఆశ్చర్యపోయిన సుందరం "నేను చెప్పిందా? నేనూ...! నీకూ....?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"మీరే! నేను పదవ తరగతిలో ఉన్నప్పుడు మీరు నేర్పిన పాఠాలే నేటికీ నా జీవన గమనానికి బాటలుగా ఉన్నాయి" అన్నాడు.

మరింత ఆశ్చర్యపోయిన సుందరం "నేను నేర్పిన పాఠాలా? అంటే నువ్వు.." అని అంటూ డాక్టర్ ముఖంలోకి పరీక్షగా చూడసాగాడు.

నేను "మీ శిష్యుడిని కృష్ణను.." అని చెప్పాడు. "కృష్ణా...!!! హా.. హా.." అని ఒక్కసారిగా షాక్ అయ్యి అలా ఉండిపోయాడు.

అది చూసి భార్య భయపడి "ఏమండీ, కాస్త ప్రశాంతంగా ఉండండి. మీరెందుకు ఆ పేరు చెప్పగానే అంతలా కంగారు పడుతున్నారు?" అని కంగారుగా అడిగింది. కానీ ఆమె మాటలేవి పట్టించుకోకుండా "డాక్టర్‌నే చూస్తూ– అంటే "నువ్వు...." అని అడిగాడు.

"చెప్పులు కుట్టే చలమయ్య కొడుకు కృష్ణ కుమార్‌ని" చెప్పాడు. డాక్టర్.

అది విన్న సుందరం మనసు కాకవికలమయింది.. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న గుండెల్లో శబ్దం పెరిగింది. అది అవమాన భారంతో కృంగిపోతోంది. ఇలాంటి పరిస్థితి పగవాడికి కూడా రాకూడదు.

“భగవంతుడా! నువ్వు నిజంగా ఎంత గొప్ప ఇంజనీరువయ్యా. నీ పనితనానికి ప్రణామములు తండ్రీ. ఎవరిని ఎప్పుడు ఎక్కడ ఎలా ఎందుకు కలపాలో నీకు బాగా తెలుసయ్యా” అని అనుకున్నాడు.

...............

కరిగిన కాలం దృశ్యాలు సోమ సుందరం కళ్ళముందు కదిలాయి.

అది ఒక మారు మూల గ్రామం. అక్కడ జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాల పిల్లలు తొమ్మిదో తరగతి పూర్తి చేసుకుని పదవ తరగతిలోకి అడుగు పెట్టిన రోజులు.. వాళ్ళ తరగతి ఉపాధ్యాయుడు సోమ సుందరం మాష్టారు.

తరగతి గదిలో మొదటి రోజు పరిచయ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుండి బడికి వచ్చే పిల్లలు ఎందరు? సొంత ఊరు పిల్లలు ఎంతమంది? అని లెక్కలు వేసి వారి తల్లిదండ్రుల వృత్తులు ఏంటి? వారి ఆచారాలు ఏంటి? అన్న విషయాలు అన్నీ క్షుణ్ణంగా తెలుసుకుంటున్నాడు సుందరం మాష్టారు.

అలా తెలుసుకునే విషయంలో మాస్టారు తక్కువ ఎక్కువలు బేరీజు వేస్తున్నాడన్న సంగతి గ్రహించిన కృష్ణ “మాస్టారు, ఊరూ, పేరూ, తల్లిదండ్రుల పేరు వరకు సరే. కానీ మిగతా విషయాలు ఎందుకు సార్ ఇప్పుడు?” అని ప్రశ్నించాడు.

కృష్ణ అడిగిన మాటకు కోపం వచ్చిన మాష్టారు “ఏరా? నీ పేరేంటి? నీది ఏ ఊరు? అని గద్దించి అడిగాడు.

“నా పేరు కృష్ణ. ఈ ఊరే మాస్టారు” అని చెప్పాడు ఏమాత్రం భయపడకుండా.

“ఓహో ఈ ఊరేనా? ఎవరి కొడుకువురా నువ్వు?” అని మరింతగా గద్దించాడు.

“బస్ స్టాండ్ దగ్గర చెప్పులు కుట్టాడే చలమయ్య ఆయన కొడుకుని” అని చెప్పాడు



“ఓహో! చలమయ్య కొడుకువా? అట్ల జెప్పు. అయినా ఇది నా తరగతి గది ఇందులో నేను చెప్పినట్టే జరిగి తీరుతుంది నోర్మూసుకుని కూర్చో” అన్నాడు.

మాష్టారి మాటలకు కోపం వచ్చినా కృష్ణ ఏమీ చేయలేక సైలెంట్ అయిపోయాడు.

మరునాడు ఉదయం తరగతి గదిలోకి వచ్చిన మాస్టారు విద్యార్థులందరిని గ్రూపులుగా విభజించారు. క్లెవర్ స్టూడెంట్స్, యావరేజ్ స్టూడెంట్స్, పూర్ స్టూడెంట్స్.. అని గ్రూపు చేస్తున్నారేమో మన మాస్టారు అని విద్యార్థులు అనుకున్నారు. కానీ వారికి ఆలస్యంగా తెలిసింది ఏమంటే మీరు తక్కువ, మీరు ఎక్కువ అని కించపరుస్తూ ఏర్పాటు చేసిన గ్రూపులనీ.

కృష్ణ మళ్ళీ మాస్టర్ని నిలదీశాడు “సార్! మీరు చేస్తుందేమీ బాలేదు మనమంతా ఒక్కటేనని పాఠాలు చెప్పాల్సిందిపోయి మీరే ఇలా స్థాయిలను నిర్ణయిస్తూ విడదీయడం కరెక్ట్ కాదు సార్” అన్నాడు.

మాస్టారుకు కోపం వచ్చింది దాంతో బెత్తంతో కృష్ణను ఎడాపెడా కొడుతూ “వేలడంత లేవు నాకు ఎదురు చెప్తావా?” అంటూ తరిమేసాడు.

ప్రధానోపాధ్యాయులు గారికి విషయం తెలిసినా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న ఆయన తీరు కృష్ణకు ఇంకా కోపం తెప్పించింది.

మాస్టారుకు-కృష్ణకు అసలు పడేది కాదు. ఏదో ఒకరోజు మాస్టారుని రాయితో కొట్టాలనుకున్నాడు. కొన్నాళ్ళు గడిచాక పాఠశాలల వార్షికోత్సవాలు జరుగుతున్న వేళ ముగింపు సభకు విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి ఏడుకొండలు గారు కింది స్థాయి అయినా కూడా అతని హోదా అధికారం పలుకుబడి అంతా కలిపి అతనిపై గల అభిమానం మాస్టారు నోటి వెంట పొగడ్తల రూపంలో బయటికి వచ్చింది. పూలమాలలతో, శాలువాలతో, మర్యాదలతో ఆ అధికారిని ఉక్కిబిక్కిరి చేస్తున్న తీరును చూసిన కృష్ణ అప్పుడే నిర్ణయం తీసుకున్నాడు.

మాస్టారునీ కొట్టాల్సింది రాయితో కాదు. బాగా చదివి, ఎదిగి జీవితంలో గెలిచి చూపించాలి. అదే ఆయనకు పెద్ద దెబ్బ అవుతుందని. అప్పుడే ఊరిబయట ఉన్న మా గుడిసె ఊరిలోకి వస్తుంది. జనం మధ్యకు రాని మా అమ్మా-నాన్నల చుట్టూ జనం ఉంటారు. పొరపాటున తగిలితే దూషించే దురాచారాన్ని దూరం చేయాలని బలంగా నిర్ణయించుకున్నాడు. పట్టుదలనే పెట్టుబడిగా చేసుకుని కష్టాన్ని ఇష్టంగా మలుచుకుని చదివి పదవ తరగతిలో రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు తెచ్చుకుని యావత్ రాష్ట్రం దృష్టిలో పడ్డాడు. అదే సోమ సుందరం మాస్టారుకు తగిలిన మొదటి ఎదురు దెబ్బ.

కృష్ణకు ప్రభుత్వమే కాకుండా ఎందరో దాతలు వచ్చి తన చదువుకు చేయూతనివ్వసాగారు. అలా ఇంటర్మీడియట్ కోసం పొరుగూరు వెళ్లడం. అదే సమయంలో సుందరం మాస్టరు ట్రాన్స్ఫర్ అవ్వడం జరిగింది. అదే వారి వీడుకోలు.

............

కృష్ణకుమార్ ఇంటర్మీడియట్ పూర్తి అయ్యాకా ఏటా లక్షల మంది విద్యార్థులు హాజరయ్యే వైద్య విద్య అర్హత పరీక్ష నీట్ పరీక్ష రాసి మొదటి స్థానంలో నిలబడి యావత్ దేశాన్ని ఆశ్చర్యపరిచాడు.

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు పొంది తాను కలగన్న డాక్టర్ కలను సాకారం చేసుకుని తన లైఫ్‌నీ కళగా మార్చుకుని తన కన్న వాళ్ళ జీవితాలు బాగు చేసి తన ఊరికి పేరు తీసుకువచ్చి ప్రస్తుతం ఇలా దేశంలోనే టాప్ డాక్టర్‌గా వెలుగొందుతున్నాడు.

........

"ఏవండీ! ఏంటి ఆలోచన? డాక్టర్ గారితో మాట్లాడాలన్నారు? ఆలోచనలో పడ్డారు" అని భార్య కుదుపుతుంటే–

ఈ లోకంలోకి వచ్చిన సుందరం "అబ్బే ఏమి లేదే" అని, లేచి కూర్చుని "కృష్ణా, నన్ను క్షమించరా నిన్ను క్షమించమని వేడుకోవడం కోసమే నేను ఇంకా బతికున్నానురా. నీ పట్ల ప్రవర్తించిన తల బిరుసుతనానికి సిగ్గుపడుతున్నాను. గురువు స్థానంలో ఉండి సుగుణాలు నేర్పించే నేను ఎన్నో తప్పులు చేశాను నన్ను మన్నించరా" అని డాక్టర్ చేతులు పట్టుకుని తన ముఖం వైపు లాక్కొని కన్నీళ్లు పెట్టుకున్నాడు.

ఒకరోజు యాక్సిడెంట్ అయ్యి ప్రాణాపాయ స్థితిలో ఉన్న నాకు రక్తదానం చేసింది చలమయ్యే అని తెలిసిన క్షణం నేను మళ్ళీ కొత్తగా పుట్టాను. కానీ రక్తం ఇచ్చింది నాకేనని మీ నాన్నకు ఈ రోజు వరకు కూడా తెలియకపోవడం. ఆ రోజు మీ అమ్మగారికి ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్‌కి వచ్చిన మీ నాన్న– డాక్టరమ్మా ఎవరికో రక్తం కావాలని చూస్తున్నారు అంట కదా!

అది ఏం గ్రూపో నాకు తెలియదు గానీ నా రక్తం ఏమైనా పనికొస్తుందో చూసి పనికొస్తే తీసుకుని తనకిచ్చి వాళ్ళ ప్రాణాలు దక్కించమని చెప్పాడు. ఆయన ఎవరికి రక్తం ఇస్తున్నది కూడా తెలియకుండా రక్తదానం చేసి నా ప్రాణాలను కాపాడాడు. ఆరోజే నాకు జీవిత సత్యం బోధపడింది.. ఉపాధ్యాయుడి స్థానంలో ఉన్న నాకు జీవిత సత్యం తెలియజేసిన తొలి గురువు మీ నాన్నగారే అయ్యారురా అప్పుడే నేను మారిపోయాను. ఎవరు తక్కువ ఎవరు ఎక్కువ అనేది నాకు ఆ రోజే తెలిసింది. మీరు ఊరు విడిచి వెళ్లిపోవడం మీ ఆచూకీ తెలియక పోవడంతో ఆ రోజు నుంచి ఈరోజు వరకు ఏదో ఒకరోజు భగవంతుడు నాకు ప్రాయశ్చిత్తం జరిగేలా చేస్తాడని ఎదురు చూస్తూనే ఉన్నాను. అది ఈరోజు ఇలా జరిగింది. దేవుడు మాకు పిల్లల్ని ఇవ్వలేదు అందుకే చేసిన పాపం కాస్తయినా తొలిగేలా చేసుకోవాలని ఇద్దరి శరణాలయం నుంచి తీసుకొచ్చి, పెంచి పెద్ద చేసి చదివించి వాళ్లకు పెళ్లిళ్ల చేశాను. కృష్ణ కుమారా! మలినంతో నిండిపోయిన నా హృదయాన్ని నీ పవిత్రమైన చేతులతో శుభ్రం చేసి నాకు కొత్త జీవితాన్ని ఇచ్చావు" అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

"అయ్యో, మాస్టారు.. మీరు పెద్దవారు. జరిగిందేదో జరిగింది. ఇప్పుడు గడిచిపోయిన దానిని తలుచుకొని బాధపడకండి. మీరంటే నాకు అప్పుడు కోపం ఉన్నా మీరు చెప్పే పాఠాలు అంటే నాకు చాలా ఇష్టం. ఆ పాఠాలు చదివే స్కూల్ ఎడ్యుకేషన్ పూర్తి చేశాను. మీ మీద కోపమే నాలో పట్టుదలను పెంచింది. నేను ప్రయోజకుడ్ని అయ్యానని చెప్పడానికి అందుకు పునాది మీరే.

ప్రతి మనిషికి తన ఎదుగుదలకు ఏదో ఒక సంఘటన స్ఫూర్తిగా నిలిచి అతన్ని గెలిపిస్తుంది. అది మిత్రుడైనా శత్రువైనా.. పుస్తకమైనా. ఏదైనా కావొచ్చు.. నాకు మీరు అయ్యారు" అన్నాడు.

"మీరు డిశ్చార్జ్ అయ్యేలోపు నేనే మిమ్మల్ని కలవాలి అనుకున్నాను. మీ ఆశీర్వాదం తీసుకోవాలి అనుకున్నాను.. అంతలోనే మీ అబ్బాయి వచ్చి నాతో మాట్లాడాలి అనగానే ఇలా వచ్చాను" అని చెప్పాడు.

ఆ మాటకు సుందరం మాస్టర్ మనసు తేలికయ్యింది. "కృష్ణ కుమారా, ఒక్కసారి మీ అమ్మా నాన్నని తీసుకుని మా ఇంటికి భోజనానికి రావాలిరా" అని చెప్పాడు.

అందుకు చిరునవ్వుతో

**"తప్పకుండా వస్తాను మాష్టారు. అంతకన్నా భాగ్యం నాకు ఇంకోటి ఉంటుందా చెప్పండి" అని అంటుండగానే– కొడుకు, అల్లుడు, కూతురు లోపలికి వచ్చారు.**

"తప్పకుండా వస్తాను మాష్టారు. అంతకన్నా భాగ్యం ఇంకోటి ఉంటుందా చెప్పండి" అని అంటుండగానే–

కొడుకు, అల్లుడు, కూతురు లోపలికి వచ్చారు.

డాక్టర్ ముఖంలో నాన్నగారి ముఖంలో ఆనందం చూసిన మోహన్ "డాక్టర్ గారు.. మీరు, మా నాన్న చాలా క్లోజ్ అయినట్టున్నారు. చాలా సంతోషంగా ఉన్నారు" అని అడిగాడు.

"ఎస్ మోహన్. క్లోజ్ అయి చాలాసేపయింది. నాన్నగారు మా ఫ్యామిలీతో మీ ఇంటికి భోజనానికి రమ్మంటున్నారు".

"ఓహో! అవునా.. అయితే మరోసారి మనమందరం మళ్లీ కలుస్తామన్నమాట" అన్నాడు అల్లుడు.

అలా అయితే ఆ భోజనం ఏర్పాట్లు మన ఇంట్లోనే కదండీ అంది ప్రమద భర్తని ఉద్దేశిస్తూ..

ఓ.. ఎస్ అంతకన్నానా అన్నాడు నవ్వుతూ భర్త...!!

– మౌనం ధ్యానం కంటే గొప్ప ఫలితాలనిస్తుంది, ఫలిస్తుంది.

– ధ్యానంలో నువ్వెవరో తెలుస్తుంది. ఏం చేయాలో సూచిస్తుంది.

– పరధ్యానం మనిషిని తప్పుదోవ పట్టిస్తుంది.

# చేతిరాత యిక మృతప్రాయమా?

రాత అంటే లేఖనం, లిపి. రాతగాడు అంటే లేఖరి, లేఖకుడు రాతపని, వ్రాతపని అక్షరాలు రాసే పని వ్రాలు, చేవ్రాలు అంటే సంతకం. చేతిరాతకు ప్రస్తుతం రోజులు చెల్లిపోతున్న డిజిటల్ ప్రపంచంలో మనం ఉన్నాం. వాట్సప్ లేదా ఇమెయిల్ ద్వారా కమ్యూనికేషన్ కొనసాగుతున్న సాంకేతిక యుగంలో చేతిరాత అరుదైె దిన వ్యవహారాలకు దూరం అవుతోంది. ముత్యాల కోవలా ఉండే చేతిరాత అందచందాలు కనుమరుగవుతున్నాయి. కాగితం, కలంతో అంతగా అవసరం లేని సాంకేతికతో మనం అడుగులు వేస్తున్నాం. కంప్యూటర్ల ఆవిష్కరణతో టైప్‌రైటింగ్ మూలపడింది. ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్లు శరవేగంగా వ్యాప్తి చెందడంతో, కమ్యూనికేషన్ వ్యవస్థ ఇమెయిల్, మెసేజ్‌లు అన్ని రాత వ్యవహారాలు మరుగున పడిపోతున్నాయి. డిజిటల్ కమ్యూనికేషన్‌లోని వేగం, సౌకర్యం సమాజం అందిపుచ్చుకొని శరవేగంగా సాగుతోంది. తరతరాలుగా విద్యావ్యవస్థకు అత్యంత ప్రాధాన్యంతో జీవం అందించే 'రాత' నిర్జీవం అవుతోంది. కాలం చెల్లిన వ్యవస్థతో విద్యావిధానం ప్రస్తుతం సతమతం కాకుండా, డిజిటల్ యుగంలోని సాంకేతిక ప్రజ్వలనం, సమాజ స్వరూపాన్ని మార్చివేసింది.



తరతరాలుగా చేతిరాత ప్రాచీన కాలం నుంచి ఉలితో శిలలు, ఘంటంతో తాళ పత్రాలు, తాటియాకులు వివిధ రూపాలలో విషయ పరిజ్ఞానాన్ని వ్యాప్తి చేసింది. ఇక విద్యావిధానంలో అక్షర సంపద ఆవిర్భవించిన తర్వాత బాలబాలికలకు తొలి అక్షరాభ్యాస దశలో అక్షరాలు దిద్దించటంతో వ్రాత, శ్రీకారం చుట్టింది. పాఠశాలలో 'హ్యాండ్ రైటింగ్' పీరియడ్‌లు కూడా ఉండేవి. రాతపుస్తకాలుండేవి. స్పష్టంగా, అర్థం చేసుకోవటానికి అక్షరాలు వంకర లేకుండా పొందికగా తీర్చిదిద్ది రాయటం చదువులో ప్రధాన ప్రక్రియగా వుండేది. ఆ అభ్యాసానికి, యథాతథ అనుకరణ అభ్యాసానికి కాపీబుక్‌లు ఉండేవి. దస్తూరి మెరుగుపరుచుకొనేటందుకు కాపీ పుస్తకాలు పిల్లలు ఉపయోగించేవారు. పరీక్షలలో మార్కులు బాగా రావాలంటే అక్షరాలు స్పష్టంగా, అర్థం అయ్యేటట్లు తీర్చిదిద్దించేవారు. కాపీయిస్ట్‌లు, క్రమేపీ కాపీరైట్‌లు కూడా అడుగు పెట్టాయి. కాగితం ఉపయోగించుకొనే రీతిలో నాడు దళసరి 'పోస్ట్ కార్డ్' తపాలా వ్యవస్థ ప్రవేశించింది. సంక్షిప్తంగా సమాచారం కార్డుపై రాయటానికి, చేరవేయటానికి పోస్ట్‌కార్డ్‌లపై రాతలు అత్యంత ప్రయోజనకరంగా వుండేవి.

చేతిరాత ఆవశ్యకత ప్రస్తుతం తగ్గిపోతోంది. సంక్షిప్త సందేశాలు, అత్యవసర సమాచారాన్ని అందించటానికి పోస్ట్‌కార్డులు, టెలిగ్రాంలు అవసరం లేకపోవటం, చేతిరాత క్షీణదశకు చేరుకుంటోంది. కళా రూపంలో పదిలపరచుకొనే స్థాయి యింకా రాలేదు. కానీ పోస్ట్ కార్డ్‌లపై మనం చేతిరాతల కోసం ఎదురు చూసే రోజులు యిక లేవు.

కార్డుల పలకరింపులు పోస్ట్‌మేన్ కోసం రోజూ అలవాటుగా చూడటం, ఉత్తర ప్రత్యుత్తరాలు, ప్రేమలేఖలు, మన ఆలోచనలను బంధుమిత్రులకు నైపుణ్యంతో ఆత్మీయంగా అందించే అవకాశాలు స్మార్ట్‌ఫోన్‌లు, ఇంటర్నెట్ పోస్ట్‌కార్డులు ఇవ్వకపోయినా, అవే మనకు యిక ఆధారం. ఇన్‌స్టంట్ మెసేజ్‌లు, ఫొటో షేరింగ్ యాప్స్‌తో, సోషల్ మీడియా అప్‌డేట్స్ రాతను పూర్తిగా కనుమరుగు చేస్తున్నాయి.

నేటి వాస్తవికతలకు ఏమాత్రం సంబంధం లేని అప్రస్తుత, అనాగరిక విలువలు కమ్ముకొంటున్నాయి. ఆత్మీయత, అనురాగం, ప్రేమ, ఉదార్పు, ధైర్యం ఇవ్వటం, ఎన్నో మానసిక భావనలు, హృదయ సంబంధిత స్పర్శలకు జీవం అందించే రాతకు దూరం అవుతున్నాం. చేతిరాత మృతప్రాయం అయ్యేకొద్దీ మానవ సంబంధ బాంధవాల వ్యక్తీకరణలో, కుటుంబాలలో మాటతో పాటు, రాత కూడా అదృశ్యమయ్యే సమాజం నడుస్తోంది. ప్రస్తుతం, కార్డులలో నాడు వ్యక్తీకరించే 'ఉభయకుశలోపరి', 'ఇక్కడ అంతా క్షేమం' వంటి పలకరింపులు వింతగా అనిపిస్తున్నాయి. రచయితలు, కవులు, కళాకారులే కాదు హృదయ స్పర్శతో తమ ఆలోచనలను వ్యక్తీకరించే ప్రవృత్తికి జన సామాన్యం దూరం అవుతున్నారు. సమాజ నైజం త్వరతగతిన మారిపోతోంది. 'యూజ్ అండ్ త్రో' సంస్కృతి ప్రబలుతోంది. నోటిమాట, చేతిరాత యాంత్రిక స్థాయి కృత్రిమతలో కొట్టుకుపోతున్నట్టే, స్మార్ట్ ఫోన్‌లు, ఇంటర్నెట్ భావజాలం శృతి మించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వైపు దూసుకుపోతోంది.

నోటిమాట అయినా చేతిరాత అయినా మేథకు సంబంధించినవి. పండితుడైనా, పామరుడైనా ఎవరైనా ఆలోచించి మాట్లాడవలసినదే, రాయవలసినదే. డిజిటల్ యుగంలో మాటకి, రాతకి పుస్తకాల ద్వారా ఉన్న అవినాభావ బాంధవ్యం ప్రస్తుత సాంకేతికత పరిపూర్ణంగా అందిపుచ్చుకొనేవరకు, రాత సజీవంగా వుంటుంది. కాలానుగుణంగా ప్రస్తుతం 21వ శతాబ్దంలో అంతర్జాలం ద్వారా అందుబాటులో ఉన్న జ్ఞానానికి ఆధారమైన మాతృకా విలువలు కలిగిన చేతిరాతను బతికించుకోగలిగితేనే మన మాతృభాష తెలుగు సంపన్నవంతమవుతుంది.

– జయసూర్య

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
**డా॥ దంతూరి పండరినాథ్**
సెల్: 9885446501/9885449458

# ఈశాన్యం తప్పనిసరిగా పెరగాలా?

**ఎస్.భాస్కర్, నందికొట్కూరు**

**ప్రశ్న: ఇల్లు కట్టుకునే స్థలానికి ఈశాన్యం పెరిగి ఉండాలంటారు. ఎందుకు? ఈశాన్యం పెరగకపోతే ఏమౌతుంది? ఈశాన్యం పెరగకుండా ఉన్న స్థలంలో ఇల్లు నిర్మించకూడదా?**

**జవాబు:** ఇల్లు కట్టుకునే స్థలానికి ఈశాన్యం పెరిగి ఉండే అవసరం లేదు. ఈశాన్యం పెరగకపోయినప్పటికీ ఆ స్థలంలో ఇల్లు కట్టుకోవచ్చు. ఈశాన్యం పెరగకపోయినా నష్టం ఏమీ లేదు. అయితే ఈ 'ఈశాన్యం పెంపు' పద్ధతి ఎందుకు వచ్చిందో తెలిస్తేగానీ అసలు విషయం బోధపడదు. నాలుగు మూలలు సమకోణాలుగా ఉన్న చతుర్భుజాకార స్థలం గృహ నిర్మాణానికి శ్రేష్ఠమైన క్షేత్రంగా వాస్తు గ్రంథాల్లో పేర్కొన్నారు.

అయితే ఎంత కచ్చితమైన సమకోణంగా ముగ్గు పోసినా పునాదులు తీసే సమయంలో, గోడలు కట్టేటపుడు తూర్పు ఆగ్నేయం లేదా ఉత్తర వాయువ్యం లేశమాత్రం పెరిగినా ఆ క్షేత్రంలో గృహ నిర్మాణం మంచి ఫలితాలు ఇవ్వదు. అందువల్ల ఈశాన్యంలో ఆ స్థలం రవ్వంత పెంపు చేస్తారు. ఈ పద్ధతిని 'ఈశాప్రాచి' అంటారు.

'ఈశాప్రాచి'ని అనుసరించటం వల్ల ఎట్టి పరిస్థితులలోనూ ఆ స్థలం తూర్పు ఆగ్నేయంలోగానీ, ఉత్తర వాయువ్యంలోగానీ పెరిగే అవకాశం ఉండదు. ఈ విధంగా ఈశాన్యం పెంపు పద్ధతి ప్రారంభమైంది. ఈశాన్యం పెరిగి వున్న స్థలం సుఖ సంపదలను, ఆయురారోగ్య అభివృద్ధిని కలుగజేస్తుంది. అదేపనిగా ఈశాన్యం కోసుగా పెరిగి ఉండాల్సిన అవసరం లేదు. ప్రకృతిసిద్ధంగా ఈశాన్యం పెరిగి ఉన్న స్థలాలను కలిగి వుండటం అదృష్టంగా భావిస్తారు.



**కె.పద్మాకర్, కడప**

## ... పక్క పక్క ఇళ్లల్లో ఉండవచ్చా?

**ప్రశ్న: గతంలో మాకు కలిగిన సందేహం మీ వల్ల నివృత్తి కలిగి నేటి వరకు తూర్పు ఇంట్లో(అంటే 1వ పోర్షన్‌లో) నివాసం చేస్తూ తృప్తిగా జీవిస్తున్నాం. మీకు మా కృతజ్ఞతలు. ప్రస్తుత సందేహమేమంటే వివాహితుడైన ఏకైక కుమారుని పక్కన ఇరువురు కుమార్తెలు నివాసం ఉండవచ్చా? లేదా? స్థానిక ప్రజలలో కుమారుని పక్కన కుమార్తెలు ఉండకూడదని సందేహం. ఈ సమస్యను నివృత్తి చేయగలరు.**

**జవాబు:** మీరు పంపించిన ఇంటి ప్లానులో చూపించిన ప్రకారం ఒకే కప్పు కింద కట్టిన పోర్షన్‌లు మీ కుమారునికి, మీ కుమార్తెలకు స్థిరాస్తులుగా ఉండవచ్చు. కానీ ఒకే కప్పు కింద ఉన్న పోర్షన్‌లో మీ కుమారుడు, కుమార్తెలు నివసిస్తూ ఉండటం వల్ల ముగ్గురికి కూడా సంబంధ, బాంధవ్యాలు విషయంలో ప్రతికూల ఫలితాలు కలిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వివాహానంతరం ముగ్గురు ఆ పోర్షన్‌లలో నివసించకపోవటమే మంచిది. 'ఉమ్మడి కుటుంబం'లో ఒకే కప్పు కింద, ఒకే వంట, ఒకే పూజతో అందరు కలిసి మెలిసి ఉంటారు. కానీ మీరు పేర్కొన్న పద్ధతిలో ముగ్గురికి మూడు వంటగదులు ఉండి స్వతంత్రంగా ఉండవలసి వస్తే ఈ పద్ధతిలో ఫలితాలు బాగుండవు. ఇలా ఉండటం కంటే దూరంగా అనుకూలమైన గృహాలలో నివసిస్తూ పరస్పర ప్రేమలను కలిగి ఉండటం ఉత్తమం. మా సలహా గుర్తు పెట్టుకొని ఉత్తరం రాసారు. మీరు బాగున్నారు. సంతోషంగా ఉంది. ●

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

వాస్తువార్త

పూర్తి పేరు : ..............................................
పుట్టిన తేది : ..............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ................
చిరునామా:..............................................

ధర్మరాజు తల పెట్టిన మహా యజ్ఞానికి అవసరమైన పురుష మృగం పాలను సేకరించడానికి పాండు కుమారుడు అమిత బలశాలి అయిన భీమసేనుడు బయలు దేరుతాడు. హరిద్వేషి అయిన ఆ రాక్షస మృగం బారి నుండి తప్పించుకొనే క్రమంలో భీముడు వేసిన రుద్రాక్షల నుండి ఉద్భవించిన పన్నెండు శివలింగాలను మహాశివరాత్రి నాడు దర్శించుకోడానికి చేసే యాత్ర పేరే 'శివాలయ ఒట్టం'.

మొదటిదైన తిరుమలై మహాదేవ మాత్రమే ఉండేదట. శివాలయాలలో తప్పనిసరిగా కనిపించే నందీశ్వరుడు ఉండేవాడు కాదట. అదే విధంగా ధ్వజస్థంభం కూడా ఈ మధ్యనే పెరుగుతున్న భక్తాదరణ తో ఏర్పాటు చేసారని తెలుస్తోంది. పూర్తిగా రాతితో నిర్మించబడిన ఆలయంలో ముఖమండపం, గర్భాలయం ఉంటాయి. గర్భాలయంలో సుందరమైన అలంకరణలో లింగరాజు నేత్రపర్వంగా దర్శనమిస్తారు. ఉపాలయాలలో శ్రీ వినాయక మరియు నాగరాజు కొలువై భావిస్తారు భక్తులు. తిక్కురుచి మహాదేవ ఆలయంలో ప్రతిరోజూ నాలుగు పూజలు జరుగుతాయి.

ఉదయం అయిదు గంటల నుండి పదకొండు వరకు, తిరిగి సాయంత్రం నాలుగు నుండి ఏడు గంటల వరకు తెరిచి ఉంటుంది. మహాశివరాత్రి నాడు మాత్రం రోజంతా ఆలయం శివాలయ ఒట్టం భక్తుల దర్శనార్థం తెరిచి ఉంటుంది.

మహాశివరాత్రి పర్వదినం కన్నా ముందు వచ్చే 'తిరువదిరై (ఆరుద్ర దర్శనం)' చాలా ముఖ్యమైనది.

# ఇహ పర సుఖాలను ప్రసాదించే శివాలయ ఒట్టం



ఆలయం దర్శించుకొన్న భక్తులు 'మార్తాండం' మీదగా 'గోపాల... గోవిందా' అని స్మరణ చేస్తూ పరుగు పరుగున రెండవదైన తిక్కురుచి మహాదేవ ఆలయం చేరుకొంటారు. ఇహ పర సుఖాలను ప్రసాదించే శివాలయ ఒట్టం యాత్ర రోజున ఈ ప్రాంతం అంతా భక్తులతో విపరీతమైన రద్దీ నెలకొంటుంది. యాత్ర చేసే భక్తులకు నీరు, కొబ్బరి నీరు, ఆహారం అందించడానికి స్థానికులు తమ ఇండ్ల ముందు ఏర్పాట్లు చేస్తారు. ఎలాంటి జాతి మాట బేధాలు కనిపించవు. అందరూ స్వచ్ఛందంగా భక్తుల సేవ చేయడానికి ముందుకు వస్తారు.

## ఆలయ విశేషాలు

తిరుమలై ఆలయం మాదిరి ద్రావిడ, కేరళ నిర్మాణ శైలి కనపడుతుంది. తమిరపారాణి నదీతీరంలో తూర్పు ముఖంగా ఉంటుంది ఆలయం. చాలా రాజులు నిర్మించిన ఆలయానికి నాయక రాజులు అదనపు నిర్మాణాలను చేర్చారు. ట్రావెన్కోర్ పాలకుడైన మార్తాండ వర్మ పునః నిర్మించారని శాసనాలు తెలుపుతున్నాయి.

మొదట్లో ఒక్క గర్భాలయం ఉంటారు. సర్పదోష నివారణ పూజలకు ఈ ఆలయం ప్రసిద్ధి అని చెబుతారు. ప్రాంగణంలో నాగప్రతిష్ఠలు కనిపిస్తాయి.ప్రత్యేకంగా చెప్పుకోవలసిన విషయం ఏమిటంటే ఆలయ స్థంభాల పైన శ్రీ గరుత్మంతుడు, శ్రీ ఆంజనేయస్వామి వారి శిల్పాలు కనిపించడం! బహుశా శ్రీకృష్ణపరమాత్మ ఈ ఆలయాల ఆవిర్భావం వెనుక ఉండటం కారణం కావచ్చు. అమ్మవారి సన్నిధి ఉండదు. తిరుమలై నుండి చేరుకొన్న భక్తులు తామ్రపర్ణి నదిలో స్నానం చేసి గోపాల నామస్మరణ చేస్తూ ఆలయంలోకి ప్రవేశించి శ్రీ గణపతిని దర్శించుకొంటారు. తరువాత శ్రీ మహాదేవ దర్శనం చేసుకొని, విభూతి సేకరించుకొంటారు. యాత్రలో విభూతి సేకరించడం చాలా ముఖ్యమైన పవిత్రమైనదిగా వైభవంగా నిర్వహిస్తారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రమైన కేరళ నుండి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. తిరుమలై నుండి మార్తాండం మీదగా ఇక్కడకి చేరుకోవచ్చును. తిక్కురుచి మార్తాండానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

## శ్రీ వీరభద్రేశ్వర స్వామి ఆలయం

మహాశివరాత్రి ముందు రోజు ప్రదోష కాలంలో మొట్టమొదట తిరుమలై మహాదేవ ఆలయం సందర్శించి, రెండవది అయిన తిక్కురుచి మహాదేవ ఆలయం చేరుకొంటారు భక్తులు. అక్కడ దైవదర్శనం చేసుకొని మూడవదైన తిరుపరప్పు శ్రీ వీరభద్ర స్వామి ఆలయం దిశగా పరుగులు పెడతారు. ఉషోదయానికి ముందు ఈ ఆలయాన్ని సందర్శించాలి. అర్ధరాత్రి సమయం లోపల పూజ పూర్తి చేసుకోవాలి.

## క్షేత్ర విశేషాలు

శివాలయ ఒట్టంలో సందర్శించ వలసిన మూడవ ఆలయం ఉన్న తిరుపరప్పు గ్రామం కోతైయార్ నదీతీరంలో నెలకొని ఉంటుంది.

కొడయార్ కోనేరు నుండి తన ప్రయాణం ప్రారంభించే ఈ నది జిల్లాలో ప్రవహించే తమిర పారాణి నదికి ముఖ్యమైన ఉపనది. ఈ నది పైన పెద్ద ఆనకట్ట కూడా నిర్మించారు. సమీపంలోని కొడయార్ తిరపరప్పు జలపాతం ప్రత్యేక పర్యాటక ఆకర్షణ.

### వావుబలి

గతించిన పితృదేవతలను సంతృప్తి పరచడానికి జులై ఆగస్టు నెలల మధ్య కేరళ పంచాంగం కొళ్ళవర్షం ప్రకారం శ్రాద్ధ కర్మలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని కర్కాటక వావు బలి అని అంటారు. ఆ రోజు మలయాళీ హిందువులు నదీతీరాలలో కొన్ని ప్రత్యేక క్షేత్రాలలో ఈ వావు బలి జరుపుతారు. మగసంతానం లేని కుటుంబాలలో స్త్రీలు వావు బలి కార్యక్రమం చేస్తారు. “కొడయార్ నది” తీరం ఈ వావు బలి కార్యక్రమానికి తగిన ప్రదేశంగా భావిస్తారు.

### క్షేత్ర విశేషాలు

మహేశ్వరుని అవమానిస్తూ నిరీశ్వర యజ్ఞం తలపెట్టాడు దక్ష ప్రజాపతి. పిలవకపోయినా పుట్టింట జరిగే కార్యం అని వెళ్లిన సతీదేవి తండ్రి చేసిన అవమానాన్ని తట్టుకోలేక యజ్ఞ గుండంలో ఆత్మత్యాగం చేసింది.



ఆగ్రహించిన రుద్రుడు వీరభద్రుని సృష్టించి దక్ష యజ్ఞం భగ్నం చేయించారు. యజ్ఞాన్ని భగ్నం చేసిన తరువాత వీరభద్రుడు ఇక్కడికి వచ్చి విశ్రాంతి తీసుకొన్నారన్నది క్షేత్ర గాథ. గర్భాలయంలో కొలువైన స్వామిని శ్రీ వీరభద్ర లేదా శ్రీ జటాధర అని పిలుస్తారు. వీరభద్రుడు త్రినేత్రుని జటాజూటాల నుండి కదా ఉద్భవించినది. మిగిలిన ఆలయాలకు భిన్నంగా స్వామి ప్రశాంత రూపంలో దర్శనమివ్వడం చెప్పుకోవలసిన అంశం. జగద్గురు శ్రీ శ్రీ శ్రీ శ్రీ ఆది శంకరాచార్య కొంత కాలం శ్రీ వీరభద్రస్వామి సేవలో గడిపారని, తన తల్లితండ్రులకు శ్రాద్ధ కర్మలు కొడయార్ నదీతీరంలో నిర్వహించారని చెబుతారు. శివాలయ ఒట్టం ఆలయాలతో ముడిపడి ఉన్నవారు మరొకరు ఉన్నారు. ఆయనే వ్యాఘ్రపాద మహర్షి.

### వ్యాఘ్రపాద మహర్షి

పులి కాళ్ళు కలిగిన మహర్షి. అచంచల శివభక్తుడు. ఈయనకు పులి కాళ్ళు రావడానికి గల కారణం కూడా శివభక్తి తేనెటీగలు కూడా వాలని తాజా స్వచ్ఛమైన పుష్పాలతో చిదంబర నటరాజ పూజ చేయాలన్నది ఆయన సంకల్పం. దాని కోసం చీకటితోనే తోటకి వెళ్లి పుష్పాలను సేకరించేవారట. చీకటిలో ముళ్ళు గుచ్చుకొని పాదాలకు గాయలయ్యేవట.

భక్తవత్సలుడైన భవనాశనుడు ఎలాంటి ముళ్ళు గుచ్చుకొని పులి కాళ్ళను వరంగా ఇచ్చారట. శ్రీ మహావిష్ణు వాహనమైన గరుత్మంతునితో, పతంజలి మహర్షితో కలిసి చిదంబరంలో నటరాజ ఆనందతాండవం వీక్షించారట. శివాలయ ఒట్టం ఆలయాల ఆవిర్భావం వివరించే గాథలోని పురుష మృగం ఈయనే అని కొందరు అభిప్రాయపడుతుంటారు. కానీ అది నిజం కాదు. సహజ శివభక్తుడైన వ్యాఘ్రపాద మహర్షి పుడమి లోని అన్ని శైవ క్షేత్రాలను సందర్శించారని ఆయా క్షేత్ర గాథలు తెలుపుతున్నాయి.

### ఆలయ విశేషాలు

ద్రావిడ, కేరళ నిర్మాణ శైలిలో పడమర ముఖంగా రాతితో నిర్మించిన ఈ ఆలయం తొమ్మిదవ శతాబ్దపు ముందు కాలంలో చోళ రాజుల కట్టడంగా చెబుతారు. తొమ్మిదవ శతాబ్దాని కన్నా ముందు కాలం నాటి పాండ్య రాజుల శాసనాలు కనిపిస్తాయి. అనంతరం తిరువనంతపురం పాలకులు ఆలయాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఎత్తైన ప్రహరీగోడల మధ్య ప్రధాన, ఉపాలయాలు అనేక మండపాలు కనిపిస్తాయి. విమానగోపురం పైన, స్తంభాల పైన చక్కని శిల్పాలు కనిపిస్తాయి. కానీ రాజగోపురం ఉండదు.

ప్రాంగణంలో శ్రీ వినాయక, శ్రీ పార్వతీదేవి సన్నిధులు తూర్పు ముఖంగా ఉంటాయి.

రెండు ప్రత్యేక విషయాలు ఈ ఆలయంలో చూడవచ్చు. సహజంగా పడమర ముఖంగా కొలువై కనిపించే నందీశ్వరుడు ఉత్తర ముఖంగా ఉంటారు.

మరే ఇతర ఆలయంలో కనిపించని జ్వర దేవర సన్నిధి శ్రీ వీరభద్ర స్వామి కొలువైన తిరుపరప్పు ఆలయంలో ప్రత్యేక సన్నిధిలో దర్శనమిస్తారు. ప్రత్యేక పూజలు జరుగుతాయి అని చెబుతారు. శివాలయ ఒట్టం ఆలయాల ఆవిర్భావానికి ముఖ్య కారణం భీమసేనునికి శ్రీ కృష్ణుడు ఇచ్చిన రుద్రాక్షలు. ఈ కారణంగా ఆలయానికి వెలుపల శ్రీ వెన్నముద్ద గోపాలుడు వేలాయుధ సుబ్రహ్మణ్య స్వామి రెండు సన్నిధులలో కొలువై ఉంటారు.

ప్రత్యేకమైన శివాలయ ఒట్టం, తిరువదిరై, మహా శివరాత్రి రోజులలో ఆలయం నిరంతరాయంగా తెరిచి ఉంటుంది. మిగిలిన రోజులలో ఉదయం అయిదు నుండి పదకొండు; తిరిగి సాయంత్రం అయిదు నుండి రాత్రి ఏడు గంటల వరకు మాత్రమే తెరుస్తారు. ప్రతిరోజూ నియమంగా నిర్ణయించిన పూజలు జరిగే శ్రీ వీరభద్ర స్వామి ఆలయం, తిరుపరప్పు శివాలయ ఒట్టంలో రెండవ క్షేత్రమైన తిక్కురుచికి పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

– ఇలపావులూరి వెంకటేశ్వర్లు

# ‘భారతమాత’ చిత్ర రూపకర్త అబనీంద్ర ఠాగూర్

ఈ రోజుల్లో రాజకీయ ర్యాలీలలో ‘భారత్ మాతా కీ జై’ అనే నినాదాలు వింటూ ఉంటాం. అయితే 1905 నాటి బెంగాల్ విభజన సమయంలో ఈ మాట జాతీయవాద నినాదంగా పుట్టిందనేది కొందరికే తెలిసుండొచ్చు. ఇది చాలా ఆసక్తికరమైన అంశం. ఆ యేడాది బ్రిటిష్ సామ్రాజ్యశక్తులు బెంగాల్‌ను మత ప్రాతిపదికన విభజించేందుకు ప్రయత్నించారు. భారత మాత ఆలోచనకు పునాది వేసిన మహనీయుడు మరెవరో కాదు, బెంగాలీ పునరుజ్జీవనోద్యమ కళాకారులలో ఒకరైన అబనీంద్రనాథ్ ఠాగూర్. ఈయన రవీంద్రనాథ్ ఠాగూర్ మేనల్లుడు.

1875లో రచించిన బంకించంద్ర ఛటోపాధ్యాయ వందే మాతరంలో కూడా భారత మాత గురించి ప్రస్తావన ఉంది. 1882లో ఆయన ప్రసిద్ధ నవల ఆనందమఠంలో ఈ గీతం ఉంది. ఆనందమఠంలో, రచయిత మొదటిసారిగా దేశాన్ని ‘మాత’అని ప్రస్తావించారు. బంకించంద్ర రచన లేవనెత్తిన భావోద్వేగాలు కళాకారుడు అబనీంద్రనాథ్ ఠాగూర్‌ను ఎంతగానో ప్రభావితం చేశాయి. దాంతో ఆయన తన ఆలోచనకు ఒక కళారూపాన్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దుర్గా, కాళీ భూమిలో, భరత మాత కూడా శక్తి, ప్రేమను చూపుతుందనే అర్థం స్ఫురించేలా నాలుగు చేతులున్న హిందూ దేవతగా కుంకుమపువ్వు వర్ణంలో వస్త్రాలు ధరించిన ‘భారతమాత’ను చిత్రించారు. 1909 నాటికి భారతదేశమంతటా భారత మాత చిత్రమే ప్రధానమైన చిత్రంగా అందరి హృదయాలలో నిలిచింది.



భారత మాత పెయింటింగ్ ఎంత శక్తిమంతమైనదోనని చెప్తూ దీనిపై మొట్ట మొదటగా మోడరన్ రివ్యూ అనే పత్రికలో నివేదిత ఓ వ్యాసం రాశారు. మాతృభూమిపట్ల స్ఫూర్తిని కల్గించడంలో ఓ భారతీయ కళాకారుడు సాధించిన విజయానికి అద్దంపట్టిన మొట్టమొదటి కళాఖండం ఇదేనని ఆమె అభివర్ణించారు.

మద్రాసులో, ప్రముఖ తమిళ కవి, సోదరి నివేదిత శిష్యుడు సుబ్రహ్మణ్య భారతియార్ తన రచనల ద్వారా దీనిని ప్రాచుర్యంలోకి తెచ్చారు. అదేవిధంగా లోకమాన్య బాలగంగాధర తిలక్, లాలా లజపత్ రాయ్ ఈ ఆలోచనను బొంబాయి, పంజాబ్‌లలో ప్రచారం చేశారు. ఇలా అబనీంద్రనాథ్ ‘భారత మాత’ చిత్రాలు దేశవ్యాప్తంగా వెలిశాయి. అబనీంద్రనాథ్ ఠాగూర్ వేసిన ఒరిజినల్ పెయింటింగ్ ఇప్పటికీ రవీంద్రభారతి సొసైటీ సేకరణలో ఉంది. అబనీంద్రనాథ్ ఠాగూర్ 1871 ఆగస్టు ఏడో తేదీన కలకత్తాలోని జోరాసంకోలో గుణేంద్రనాథ్ ఠాగూర్, సౌదామిని దంపతులకు జన్మించారు. ఆయన తాత గిరీంద్రనాథ్ ఠాగూర్. ఆయన తాత, అన్నయ్య గగనేంద్రనాథ్ ఠాగూర్ కూడా కళాకారులే. ‘ఇండియన్ ఆర్టియన్’ సొసైటీ ప్రధాన కళాకారుడు, సృష్టికర్త. ఆధునిక భారతీయ పెయింటింగ్ అభివృద్ధికి దారి తీసిన బెంగాల్ స్కూల్ ఆఫ్ ఆర్ట్‌ను స్థాపించారు. ఈయన పిల్లలకోసం కొన్ని రచనలు చేశారు. బెంగాల్ స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లోని ఇతర కళాకారులతో పాటు, ఠాగూర్ అజంతా గుహల నుండి ప్రేరణ పొంది భారతీయ కళా చరిత్ర నుండి ఉద్భవించిన జాతీయవాద భారతీయ కళకు అనుకూలంగా తన ప్రతిభను ప్రదర్శించారు. 1880లలో కోల్‌కతాలోని సంస్కృత కళాశాలలో చదువుతున్నప్పుడు చిత్రకళ నేర్చుకున్న ఈయన 1889లో, ప్రసన్న కుమార్ ఠాగూర్ వంశస్థుడైన భుజగేంద్ర భూషణ్ ఛటర్జీ కుమార్తె సుహాసిని దేవిని వివాహం చేసుకున్నారు. సెయింట్ జేవియర్స్ కళాశాలలో ప్రత్యేక విద్యార్థిగా ఇంగ్లీష్ చదివారు. ఈయన సోదరి పేరు సునయని దేవి.

1897లో అతను గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ ఆర్ట్ వైస్ ప్రిన్సిపాల్ నుండి పాఠాలు నేర్చుకున్న ఈయన, సాంప్రదాయ యూరోపియన్ విద్యా పద్ధతిలో చదువుకున్నారు. పెయింటింగుకి సంబంధించి సాంప్రదాయ భారతీయ పద్ధతులను విశ్వసించారు. 1930లో చిత్రించిన అరేబియన్ నైట్స్ సిరీస్ పెయింటింగ్స్‌కి విశేష ఆదరణ లభించింది. అబనీంద్రనాథ్ తన జీవితాంతం లండన్‌కు చెందిన కళాకారుడు, రచయిత, లండన్ రాయల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్ చివరి అధ్యక్షుడైన విలియం రోథెన్‌స్టెయిన్‌తో సుదీర్ఘ స్నేహాన్ని కొనసాగించారు. 1910 శరదృతువులో భారతదేశం వచ్చిన రోథెన్‌స్టెయిన్, అజంతాలోని పురాతన బౌద్ధ గుహలతో సహా భారతదేశ సాంస్కృతిక, మతపరమైన ప్రదేశాలను సర్వే చేయడానికి దాదాపు ఏడాదిపాటు ఉన్నారు. ఇంగ్లీషులో రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలి ప్రచురణ ఠాగూర్ కుటుంబానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెడితే, అబనీంద్రనాథ్ చిత్ర కళారచన పాశ్చాత్య దేశాలలో మరింత ప్రసిద్ధి చెందడానికి దోహదపడింది. 1942లో విశ్వభారతికి చాన్సలర్ అయిన అబనీంద్రనాథ్ ఠాగూర్ 1951 డిసెంబర్ అయిదో తేదీన కన్నుమూశారు. ఆయన మరణించిన కొంత కాలానికే ఆయన పెద్ద కుమారుడు అలోకేంద్రనాథ్, తన తండ్రి పెయింటింగ్స్ సేకరించి రవీంద్రభారతి సొసైటీ ట్రస్టులో భద్రపరిచారు.



**- యామిజాల జగదీశ్**

# కన్నవారి కిరాతకాలు

హైదరాబాదులో ఓ కన్నతల్లి తన ఇద్దరు కవల పిల్లల్ని చంపి తానూ ఆత్మహత్య చేసుకున్నది. పద్మానగర్‌లో సాయిలక్ష్మి (27), అనిల్‌కుమార్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి రెండేళ్ల అబ్బాయి చేతన్ కార్తికేయ, అమ్మాయి లాస్యవల్లి ఉన్నారు. అబ్బాయి బుద్ధిమాంద్యంతో పుట్టడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతూ ఉండేవి.

ఈ క్రమంలో సాయిలక్ష్మి తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఇద్దరు పిల్లల్ని గొంతునులిమి చంపేసింది. తరువాత భవనంలోని మూడవ అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది.

ఎపిలోని కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో కామరాజు తన ఇద్దరు పిల్లలకు బాదంపాలలో పురుగుల మందు కలిపి తాగించి చంపేసాడు. అనంతరం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయిదేళ్ల క్రితం కామరాజు భార్య ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. చనిపోయే ముందు కామరాజు సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ముగ్గురు వ్యక్తుల వల్లే చనిపోతున్నట్లు వీడియోలో తెలిపాడు.

సంగారెడ్డి జిల్లా, అమీర్‌పుర్‌లో రజిత ప్రియుడిని వివాహం చేసుకోవాలని తన ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్లను పొట్టనబెట్టుకున్నది. ఆమె ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడు తన కన్నా 20 యేళ్ల పెద్దవాడైన చెన్నయ్యతో పెళ్లి జరిగింది. భర్త వాటర్ ట్యాంక్ డ్రైవర్‌గా, భార్య ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల తన పదవ తరగతి స్నేహితుడు శివతో పరిచయం పెంచుకున్నది. ఇద్దరు పెళ్లి చేసుకోవడానికి పిల్లలు అడ్డుకావడంతో భర్తలేని సమయంలో పిల్లల్ని ఒకరి తరువాత ఒకరిని ఊపిరి ఆడకుండా చేసి చంపేసింది.

సమాజంలో ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రజలు రకరకాల వ్యాఖ్యలు చేస్తారు. ఇతరులపై నిందలు వేస్తారు. హత్య చేసినవారిని తీవ్రస్థాయిలో తూలనాడుతారు. ఇదంతా కలియుగం మహిమ అనేవారు ఉంటారు. బ్రహ్మంగారు ఇలాంటి దారుణాలు జరుగుతాయని ఎప్పుడో చెప్పారు అనేవారు ఉంటారు. ఈ సమాజం ఇక బాగుపడదు.. అంటూ కొందరు శాపాలు పెడతారు. అయితే శాస్త్ర, సాంకేతిక, వైద్య పరిజ్ఞానం విశేషంగా అందుబాటులో ఉన్న సమయంలో కారణాలు పరిష్కార మార్గాలు అన్వేషించాలి.



## మానసిక రుగ్మతలే కారణం

కన్నపిల్లల్ని చంపి, ఆత్మహత్యలు చేసుకుంటున్నవారు, ప్రియుని కోసం పిల్లల్ని పొట్టనపెట్టుకున్న వారిని పరిశీలిస్తే పలు మానసిక సమస్యలు వెలుగు చూస్తాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగిన పలు అధ్యయనాలలో ఇలాంటి దారుణాలకు మానసిక సమస్యలే అధిక శాతం కారణం అని వెల్లడయ్యింది. కొందరు మహిళల్లో ప్రసవానంతరం సైకోసిస్ తలెత్తుంది. వారిలో దిగులు, బాధ, భయం, ఆందోళన, విపరీత ధోరణులు కనిపిస్తుంటాయి. చనిపోవాలని, చంపాలన్న ఉక్రోషం కనిపిస్తుంటుంది.

కొందరిలో తీవ్రమైన సైకోటిక్ లక్షణాలు ఉంటాయి. కొన్ని సందర్భాలలో తీవ్రమైన డిప్రెషన్, భ్రమలు, మూఢనమ్మకాలు ఇలాంటి కిరాతకాలకు కారణం అవుతాయి. కొందరు తల్లులు తాను చనిపోతే పిల్లలు సమాజంలో బతకలేరన్న భావంతో చంపేస్తారు. కొందరు భర్తపైన ప్రతీకారం తీర్చుకోవడానికి పిల్లల్ని హత్య చేస్తారు. కొందరు విపరీతమైన లైంగిక కోర్కెలు తీర్చుకోవడానికి అనుచిత హత్యలకు పాల్పడుతారు. ఇలాంటి వారిలో నింఫోమ్యానియా ఉండే అవకాశం ఉంది. కొంతమంది తండ్రులలో తీవ్రస్థాయిలో అనుమానం రుగ్మత ఉంటుంది. ఆ పిల్లలు తనకు పుట్టలేదని భ్రమించి కక్ష కట్టి చంపేస్తుంటారు.

వీటితో పాటు ఆర్థిక, సామాజిక సమస్యలు, ఒత్తిళ్లు, శతృత్వాలు ప్రేరకాలుగా పనిచేస్తాయి. ప్రేమ వ్యవహారాలలో పరువు కోసం హత్యలు చేస్తుంటారు.

కాబట్టి సమాజంలో మానసిక రుగ్మతలు, హత్యకు దారితీసే సందర్భాల పట్ల అవగాహన కల్పించాలి. దంపతులలో ఒకరు ఒకరు విపరీత ధోరణి, ప్రవర్తనా లోపాలు, రుగ్మతలతో బాధపడుతుంటే మరొకరు చికిత్స చేయించాలి. ప్రసవ సమయంలో డాక్టర్లు గుర్తించి సలహాలు ఇవ్వాలి. ఎవరికి వారు చావాలి, చంపాలి అనిపిస్తే మానసిక నిపుణులను కలవాలి.


– డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి,
సైకాలజిస్టు

# 26 అక్టోబరు, 2025 నుండి 1 నవంబరు, 2025 వరకు



## వారఫలం

**శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు**

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం అందరూ ఆశ్చర్యపడే విధంగా మీలో మార్పులు వస్తాయి. ప్రేమ పెళ్లి చేసుకోవాలి అన్న ఆలోచను కలిగి ఉంటారు. ప్రకృతి వైద్యం, ఆయుర్వేద వైద్యం తీసుకుంటారు. సంఘసేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. తోటలు అకర్షిస్తాయి. కొన్ని సందర్భాలలో మామిడి, కొబ్బరి తోటలు వేయాలి అని ఆలోచిస్తారు. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి.

### వృషభం

ఈ వారం మీరు పడుతున్న కష్టాన్ని శ్రమకి అయిన వాళ్ళ కన్నా బయట వాళ్ళు ఎక్కువగా గుర్తించి మిమ్మల్ని ఆదరిస్తారు. ఎంతగానో ప్రోత్సహిస్తారు. వాళ్ళ చేతుల్లో ఉన్నటువంటి చిన్న చిన్న సహాయాలను మీకు అందజేస్తారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది. ఇది మీ మానసిక ఉత్తేజానికి కారణం అవుతుంది.

### మిథునం

ఈ వారం విదేశాలలో ఉన్నవారికి సొంత ఇంటి కల నెరవేరుతుంది. విదేశీ అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. బ్యాంకు ఉద్యోగస్తులకు బాగుంటుంది.ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల సంఘసేవ కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి.

### కర్కాటకం

ఈ వారం విందు వినోద కార్యక్రమాలలో శుభకార్యాలలో పాల్గొంటారు. మీకు చేతనైన సహాయం అందిస్తారు. కొంతమందితో స్వల్పమైన విభేదాలు ప్రారంభమవుతాయి. సంతానమునకు అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. పసుపు వత్తులతో అష్టమూలికాతైలంతో నిత్య దీపారాధన చేయండి. మంచి ఉద్యోగం అవకాశం రావడం మీ మానసిక సంతోషానికి కారణం అవుతుంది.

### సింహం

ఈ వారం మీ విషయాలు ఎవరికీ తెలియకూడదు అని ఎంతగానో పరితపిస్తారు. దూరప్రాంతాల నుంచి ముఖ్యమైన సమాచారాన్ని అందుకో గలుగుతారు. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా గాని రాజకీయాల్లో ప్రవేశించాలని ఆలోచనలు ముడి పడతాయి. శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి.

### కన్య

ఈ వారం నూతన వస్తువులు వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా గాని రాజకీయాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. కొన్ని పదవుల కోసం ప్రయత్నం చేయాలని భావిస్తారు. కొత్తగా పరిచయమైన వ్యక్తులకు ఇట్టి విషయాలను తెలియనివ్వవద్దు.

### తుల

ఈ వారం భవిష్యత్తులో సంపాదన కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. సొంత ఉపాధి ఉన్నవారికి కాలం అనుకూలంగా ఉంటుంది. మీ పేరు మీదున్న సంస్థకు గుడ్విల్ పెరుగుతుంది. ప్రజాదరణ కలిగి ఉంటారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. రాబోయే రోజుల్లో మంచి అవకాశాలను అందుకో గలుగుతారు. వినోదభరితమైన కార్యక్రమాల పట్ల ఎక్కువగా ఆకర్షితులవుతారు. పనిమీద శ్రద్ధ తగ్గుతుంది.

### వృశ్చికం

ఈ వారం కొత్త ప్రాజెక్టుల కోసం ప్రయత్నాలు మొదలుపెడతారు.ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా సోషల్ మీడియా ద్వారా ప్రచారాన్ని ముమ్మరం చేస్తారు. అనుకున్న కార్యక్రమాలలో పురోగతి కోసం స్నేహితుల సహాయాన్ని ఆశిస్తారు. అరటినార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన జరిపించండి. వినోదభరితమైన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. పొలాలు పంటలకు సంబంధించిన అంశాలు ఆకర్షిస్తాయి.

### ధనస్సు

: ఈ వారం గృహ సమస్యల నుంచి బయటపడతారు. స్నేహ ఒప్పందాలు బలపడతాయి. వృత్తి సంబంధమైన అభివృద్ధిలో ఆటంకాలు తొలగిపోతాయి. వెన్ను నొప్పి బాధించే సూచనలు ఉన్నాయి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. సుమంగళి పసుపుతో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి. వివాదాలకు, విభేదాలకు దూరంగా ఉండండి. నీలాప నిందలకు తావు లేకుండా ఉండటానికి ఈ సూచన చేయడం జరిగింది.

### మకరం

ఈ వారం ఇంటికి సంభందించిన వ్యవహారాలు ముడిపడతాయి ఎన్నో రోజులగా అద్దె ఇవ్వకుండా భాదపెడుతున్న వారి నుండి విముక్తి లభిస్తుంది. కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పాత స్నేహాలు వల్లనా ప్రయోజనాలు, ఉపయుక్తమైన సమాచారం లభిస్తుంది. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. అష్టమూలిక తైలంతో లక్ష్మీ తామర వత్తులతో దీపారాధన చేయండి. వీళ్ళు అయినా వారు కావడం వలన మొహమాటంగా వ్యవహరిస్తారు.


### కుంభం


ఈ వారం రాజకీయాలు ఆకర్షిస్తాయి పలువురితో పరిచయాలు అందుకు కారణం అవుతుంది. స్వల్పమైన అనారోగ్య సమస్యలతో సతమతమవుతారు. కొత్త బాధ్యతలను స్వీకరిస్తారు. ప్రయోజనాలని అందుకుంటారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. ఆంజనేయస్వామి వారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుటన ఈ బొట్టును ధరించండి.


### మీనం

ఈ వారం సహోదర సహోదరి వర్గంతో భిన్నమైన టువంటి అభిప్రాయ బేధాలు, మాటలు వినడం, అనేది మీ మానసిక సంఘర్షణకి కారణమవుతుంది. వాళ్ల కోసం మీరు చేసిన త్యాగాలు వాళ్ళంత తొందరగా మరిచిపోవడం మీలో అసహనానికి, దిగులుకి కారణమవుతుంది. లీజులు, లైసెన్సులు కలిసి వస్తాయి. ఎరుపు వత్తులతో అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి.

# ఈ వారం కార్టూన్స్


అలా ఎలా అనుకుని వాడేసుకుంటారు? అమ్మగారి సైజ్ ఏంటి? నా సైజ్ ఏంటి. అని చెబుతూనే ఉన్నా అమ్మా!!


గుంజీలు తీస్తున్నాకదా.. చెవులు పట్టుకునే తీయాలి అనే ఛాదస్తం ఎందుకే!?
శ్రీమతి గంగమ్మ
ఫిజికల్ డైరెక్టర్


అయ్యో.. అది వేయింగ్ మెషిన్ కాదే.. ఇండక్షన్ స్టవ్!!





మయన్మార్-నాగాలాండ్ సరిహద్దుల్లో ఉన్న ఈ కొండలను నాగా హిల్స్ అంటారు. పన్నెండు వేల అడుగుల్లో ఎత్తులో ఉంటాయి. ఈ పర్వతాల మధ్యలో ఏర్పడిన నాగాహిల్ ఓఫియోలైట్ జాతీయ భౌగోళిక మాన్యుమెంట్‌గా గుర్తింపు పొందింది.

